తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్

బుధవారం

16 సెప్టెంబర్ 2026

మిగతా 11లో..

## పసందైన భోజనం..
## కడుపు నిండా తింటున్నారు!





- 23 గ్రామ పంచాయతీలు 44 ప్రభుత్వ పాఠశాలలు, ఒక జూనియర్ కాలేజీ
- 3,011మంది విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం
- ఆకలికి చెక్.. చదువుపై ఫోకస్
- పేదింటి పిల్లలకు సర్కారు భోజనం కొండంత అండ
- బడిలో భోజనం.. పిల్లల ముఖాల్లో చిరునవ్వులు

**కోహిర్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** బడి గంట మోగగానే పుస్తకాలతో పాటు భోజనం వాసన కూడా విద్యార్థులను పలకరిస్తోంది. ఒకప్పుడు ఉదయం అల్పాహారం లేకుండానే పాఠశాలకు వచ్చే పేదింటి పిల్లలకు ఇప్పుడు బడిలోనే అల్పాహారం.. మధ్యాహ్నం కడుపునిండా భోజనం అందుతోంది. దీంతో ఆకలి బాధకు చెక్ పడటమే కాకుండా.. చదువుపై శ్రద్ధ పెడుతున్నామని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 'పసందైన భోజనం' పథకం సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు అండగా నిలుస్తోంది. కోహిర్ మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలు 44 ప్రభుత్వ పాఠశాలలు, ఒక జూనియర్ కళాశాలలో ఈ పథకం అమలవుతోంది. ప్రతిరోజూ సుమారు 3,011మంది విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ఆహార భద్రతతో పాటు పాఠశాలలోనే మంచి భోజనం లభిస్తుండటంతో తల్లిదండ్రుల్లోనూ సంతృప్తి వ్యక్తమవుతోంది.

**ఆకలి బాధకు తెర.. చదువుపై గురి!**

చేతిలో పుస్తకం ఉన్నా.. కడుపులో ఆకలి ఉంటే పాఠంపై దృష్టి పెట్టడం కష్టమే. ఈ సమస్యకు 'పసందైన భోజనం' పథకం కొంతమేర పరిష్కారం చూపుతోంది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పాఠశాలలోనే అందుతుండటంతో విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడకుండా తరగతుల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కడుపు నిండితేనే చదువుపై మనసు నిలుస్తుందనే భావనకు ఈ పథకం బలం చేకూరుస్తోంది.

**పేదింటి పిల్లలకు పెద్ద ఊరట...**

కూలి, వ్యవసాయ పనులకు వెళ్లే తల్లిదండ్రులకు పిల్లల భోజనం విషయంలో పాఠశాలే అండగా మారుతోంది. ఉదయం పిల్లలకు టిఫిన్ సిద్ధం చేయడం, మధ్యాహ్నం భోజనం పంపించడం వంటి ఇబ్బందులు కొంత మేర తగ్గుతున్నాయి. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు పాఠశాలలోనే రెండు పూటలా ఆహారం అందడం ఉపశమనంగా మారింది.

**బడి భోజనంతో హాజరుకు ఊపు...**

పిల్లలకు చదువుతో పాటు భోజనం కూడా అందుతుండటంతో పాఠశాల వాతావరణంలో మార్పు కనిపిస్తోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఉదయం అల్పాహారం కోసం పిల్లలు ఆసక్తిగా పాఠశాలకు చేరుకోవడం, మధ్యాహ్న భోజనం అనంతరం ఉత్సాహంగా తరగతులకు హాజరవడం కనిపిస్తోంది. విద్యార్థుల ఆకలి తీర్చడం మాత్రమే కాదు.. వారిని బడికి కట్టిపడేయడంలోనూ ఈ పథకం కీలకంగా మారుతోందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

**భోజనం రుచిగా ఉంటే.. బడికి రావడం ఇష్టమే!**

పాఠశాలలో అందుతున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనంపై విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నుంచి తెచ్చుకునే ఆహారంతో పోలిస్తే పాఠశాలలో అందరూ కలిసి భోజనం చేయడం వారికి ఆనందాన్ని కలిగిస్తోంది. మధ్యాహ్న భోజన సమయానికి పిల్లలు ఉత్సాహంగా క్యూలో నిలబడి భోజనం చేయడం పాఠశాలల్లో సాధారణ దృశ్యంగా మారింది.

**నాణ్యతపై పర్యవేక్షణ అవసరం**

విద్యార్థులకు రోజూ భోజనం అందిస్తున్న నేపథ్యంలో ఆహారం నాణ్యత, పరిశుభ్రత, రుచి విషయంలో ఎలాంటి రాజీ లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. వంటశాలల పరిశుభ్రత, భోజనం తయారీ, వడ్డించే విధానం తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తే పథకం మరింత ప్రయోజనకరంగా ఉంటుందని సూచిస్తున్నారు.

**పేద విద్యార్థులకు ఎంతో మేలు: ఎంఈఓ జాకీర్ హుస్సేన్**

"ప్రభుత్వం చేపట్టిన 'పసందైన భోజనం' పథకం వల్ల పేద విద్యార్థులకు ఎంతో మేలు జరిగింది. వారు కడుపునిండా తింటున్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఇలాంటి

## అలంపూర్‌లో 1500 ఏళ్ల నాటి సైకత గణనాథుడు



**జోగులాంబ గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** వినాయక చవితి సందర్భంగా అష్టాదశ శక్తిపీఠమైన అలంపూర్ క్షేత్రంలోని శ్రీ జోగులాంబ సమేత బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలోని 1500 ఏళ్ల నాటి సైకత గణనాథుడు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. తుంగభద్ర నది ఇసుకతో రూపొందించిన ఈ విగ్రహానికి అప్పట్లో 'జడీబంధనం' అనే ప్రత్యేక ప్రక్రియను ఉపయోగించినట్లు ఆలయ వర్గాలు చెబుతున్నాయి. శతాబ్దాలు గడిచినా విగ్రహం చెక్కుచెదరకుండా ఉండటం విశేషంగా పేర్కొంటున్నారు.

విగ్రహాన్ని తాకినప్పుడు స్వల్పంగా ఇసుక రాలడం ఇప్పటికీ కనిపిస్తుందని భక్తులు చెబుతున్నారు. ఇసుకతో రూపొందిన మూర్తి ఇన్నేళ్లుగా స్థిరంగా ఉండటం అద్భుతంగా భావిస్తున్నారు. దక్షిణ ముఖంగా ధ్యాన ముద్రలో కొలువై ఉన్న ఈ గణనాథుడిని వినాయక చవితి సందర్భంగా దర్శించుకుంటే విఘ్నాలు తొలగి శుభఫలితాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. శక్తిపీఠం దర్శనానికి వచ్చే భక్తులు ఈ విశిష్ట సైకత గణపతిని దర్శించుకోవాలని ఆలయ వర్గాలు కోరాయి.

### ప్రధాని నరేంద్ర మోదీ కోసం
## ఆశీస్సుల దీపం వెలిగిద్దాం: ఎంపి అరుణ



**నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్ 15(జనంసాక్షి):** ప్రధాని నరేంద్రమోడీ 17న జన్మదినం సందర్భంగా ఆశీస్సుల జ్యోతి వెలి గించి వికాసిత్ భారత్ 2047 లక్ష్యం సాధనకు ప్రధాని నరేంద్ర మోదీకి మరింత శక్తి, ఆయుష్షు కోసం ప్రార్థిద్దామని పాలమూరు ఎంపీ డి కే అరుణ పిలుపునిచ్చారు.ప్రజా సేవే దేశ సేవ అని నమ్మిన మన నాయకుడు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిరంతరం గత 25 ఏళ్లుగా ప్రజా సేవలో అలు పెరుగకుండా సేవలు అంది స్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలో కూడా భారత దేశాన్ని ముందుకు నడిపి, ఆత్మవిశ్వాసంతో కరోనా ఎదుర్కొన్నాం. ఉగ్రవాదంపై ఉక్కు పదం మోపి అణిచివేస్తూ అరికడుతున్నారన్నారు.నక్సలిజం ముక్త్ భారత్ లక్ష్యంతో నక్సలిజం అంతం చేశారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంతో అడుగులు వేస్తున్న, మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినంసెప్టెంబర్ 17వ తేదీన తెలంగాణ విమోచన దినోత్సవం రోజునే సాయంత్రం 6గంటల నుంచి 7గంటల మధ్య ఆశీస్సుల దీపం వెలిగిద్దానన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని, దీర్ఘాయుష్షుతో దేశానికి మరింత సేవ చేయాలనీ భగవంతుడిని ప్రార్థిస్తూ వారికీ మరింత శక్తి, ఆయుష్షు ఇవ్వాలని ప్రతి ఒక్కరు తమ ఇండ్ల ముందు ఆశీస్సుల దీపం వెలిగిద్దామని ఆశీస్సుల దీపం నేను వెలిగిస్తున్న, మీరు వెలిగించండనీ కోరారు.

## కరెంటు కోతలకు ఎండిన వరి.. గొర్రెలకు మేత!

- కళ్లముందే కరిగిన రైతు ఆశలు.. పెట్టుబడి బూడిద
- తీవ్ర ఎండల ప్రభావంతో కొంత మేర పంట నష్టం
- ప్రభుత్వమే నష్టపరిహారం అందించాలని రైతు డిమాండ్





**మక్తల్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** నారాయణపేట జిల్లా మక్తల్ మండలం మాద్వార్ గ్రామానికి చెందిన యువ రైతు కర్నె బాల్‌రాజ్ తనకున్న రెండు ఎకరాల పొలంలో బోరు నీటి ఆధారంగా వరి సాగు చేశాడు. పంటను కాపాడుకొని మంచి దిగుబడి సాధించాలనే ఆశతో సాగు చేపట్టిన రైతుకు ఆదిలోనే విద్యుత్ కోతలు ఇబ్బందులు తెచ్చిపెట్టాయి. పంటకు కీలకమైన సమయంలో సక్రమంగా విద్యుత్ సరఫరా కాకపోవడంతో అవసరమైన తడులు అందక పంట క్రమంగా ఎండిపోవడం ప్రారంభమైంది.

మరోవైపు సెప్టెంబర్‌లోనూ కొనసాగుతున్న తీవ్ర ఎండల ప్రభావంతో భూమిలో తేమ వేగంగా ఆవిరైపోయింది. బోరు నీటితో పంటను కాపాడుకునేందుకు రైతు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో రెండు ఎకరాల్లో సాగు చేసిన వరి పంటలో కొంత తక్కువ ఎకరా మేర పంట తీవ్రంగా దెబ్బతిని ఎండిపోయింది.

మిగతా 10లో..

## అక్రమ మట్టి తరలింపు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు

- గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి
- రోడ్లపై ఇష్టారాజ్యంగా మట్టి బోడేలు అన్లోడ్
- వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం





**మిడ్జిల్, సెప్టెంబర్ 16(జనంసాక్షి):** నిబంధనలను తుంగలో తొక్కుతూ కొందరు స్వార్థపరులు చేస్తున్న అక్రమ మట్టి తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రాత్రి పగలు తేడా లేకుండా మట్టిని తరలిస్తున్నారు. ఒక పక్క గ్రామ పంచాయతీ ఆదాయానికి భారీగా గండి పడుతుంటే, మరోపక్క సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రోడ్లపై ఇష్టారాజ్యంగా భారీ వాహనాలు. నడుపుతున్నారు ప్రమాదంలో. పాదచారులు. అక్రమార్కులు తమ స్వలాభం కోసం ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా మట్టిని నిండుగా నింపి, రోడ్లపై అత్యంత వేగంగా నడుపుతున్నారు. దీనివల్ల వాహనాల నుండి మట్టి రోడ్డుపై పడి తీవ్ర దుమ్ము, ధూళి లేస్తోంది. ఇష్టానుసారంగా రోడ్లపై ఎక్కడపడితే అక్కడ మట్టిని అన్లోడ్ చేస్తున్నారు. దీనివల్ల ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఈ దారి గుండా ప్రయాణించాలంటే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సి వస్తోంది. రోడ్డుపై మట్టి పేరుకుపోవడంతో వాహనాలు జారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు.కొంతమంది అండదండలతోనే ఈ దందా. అక్రమ రవాణా వెనుక స్థానికంగా ఉన్న కొందరు ప్రభావవంతమైన వ్యక్తుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తమ స్వంత లాభాల కోసం అక్రమార్కులకు మద్దతు పలుకుతూ, ఈ వ్యవహారాన్ని ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ అభివృద్ధికి చెందాల్సిన వనరులను ఇలా కొల్లగొడుతుంటే.. అధికారులు వారికి మద్దతు పలుకుతున్నారని ప్రజలలో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అక్రమ మట్టి తరలింపు పట్టించుకోని అధికారులు.. ప్రేక్షక పాత్రలో వ్యవహరిస్తున్నారు. మట్టి అక్రమ రవాణాపై గ్రామస్థులు పలుమార్లు సంబంధిత అధికారులకు, రెవెన్యూ శాఖకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించకపోవడం వెనుక ఉన్న కారణాలేంటో అర్థం కావడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఈ అక్రమ మట్టి తరలింపును అడ్డుకోవాలని, గ్రామ పంచాయతీ ఆదాయాన్ని కాపాడాలని మరియు అక్రమార్కులకు సహకరిస్తున్న వారిపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సంగారెడ్డిలో ఘనంగా వినాయక చవితి వేడుకలు

- గణనాధునికి ప్రత్యేక పూజలు జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు





**సంగారెడ్డి సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** పలు గణేష్ మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు సోమవారం వినాయక చవితి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల్లో తొలి రోజు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

రామ్‌నగర్‌లోని రామ్ మందిర్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో జగ్గారెడ్డి భక్తులతో కలిసి భజన చేస్తూ ఊరేగింపుగా పాల్గొన్నారు. అనంతరం బ్రాహ్మణవాడ నుంచి తీసుకొచ్చిన మట్టి గణపతి విగ్రహాన్ని మండపంలో ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు.

గంజి మైదాన్‌లో వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో జగ్గారెడ్డి కుమార్తె జయారెడ్డి, అల్లుడు గుణ చైతన్యరెడ్డి పూజల్లో పాల్గొన్నారు. రామ్ మందిర్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలోనూ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద సంగారెడ్డి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో చైతన్య యువజన సంఘం ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో, అలాగే ఐబీ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుడు కూన సంతోష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలోనూ జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు.

బైపాస్ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద భరత్ సాయి రెడ్డి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో భరత్ సాయి రెడ్డి, ఆయన కాబోయే సతీమణి పాలక్ పటేల్ ఆధ్వర్యంలో తొలి రోజు పూజలు ఘనంగా జరిగాయి. కార్యక్రమాల్లో నిర్మల జగ్గారెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి ప్రజలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.


# ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులైనా కళాకారుల కల నెరవేరలేదు

- కళాకారుల కన్నీటి బాధా
- మేనిఫెస్టోలో పెట్టిన జీవోను అమలు చేసి కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలి



మెదక్ అర్బన్ సెప్టెంబర్ 15(జనంసాక్షి) తెలంగాణ ఉద్యమంలో ఊరూర తిరిగి ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన అర్హులైన కళాకారులకు సారధిలో ఉద్యోగాలు ఇవ్వాలని మాట్లాడుతూ మెదక్ జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారుల జిల్లా సంఘం అధ్యక్షులు గుడాల సత్యనారాయణ , ఉపాధ్యక్షులు నీరుడి సాయిలు, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లపు స్వామి జిల్లా కార్యవర్గం సభ్యులు రమేష్ , ప్రేమ్ , శేఖర్ చారి, కంచనపల్లి బిక్షపతి , సుమ , పాపయ్య , శ్రీశైలం,భూమయ్య , చందు , యాదగిరి , మురళి ఈ కార్యక్రమంలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం అని చెప్పి వెయ్యి రోజులు పూర్తి అయిన కళాకారులకు ఉద్యోగాల కల నెరవరేలేదన్నారు. శాసనసభలో కళాకారుల పై కపట ప్రేమను చూపుతూ మాట్లాడిన సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు ఉద్యోగాలు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. సాంస్కృతిక సారధిలో ఉద్యోగాల కోసం మేనిఫెస్టోలో పెట్టిన జీవోను వెంటనే అమలు పరచాలని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. వెంటనే నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాలు ఇచ్చే దిశగా కార్యచరణ రూపొందించాలని, లేనిపక్షంలో 33 జిల్లాల కళాకారులతో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతమన్నారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా అర్హులైన కళాకారులు అందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కళాకారుల జీవితాలు ఎంతో దుర్భరంగా మారాయన్నారు. ఆనాడు ఉద్యమం కోసం చేస్తున్న ఉద్యోగాలు పనులు వదిలేసి ఉద్యమించామని, ఈనాడు ఉపాధి లేక ఇల్లు గడవని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కళాకారులు అందరికీ న్యాయం చేస్తామని ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వం 550 మందికి సాంస్కృతిక సారధిలో ఉద్యోగాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారనీ, అసలైన అర్హులైన నిజమైన కళాకారులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా అర్హులను గుర్తించి ఉద్యోగాలు కల్పించి, మా కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఎన్నికల్లో కళాకారులను ఆదుకుంటామని వెయ్యి ఉద్యోగాలు ఇస్తామని మాట ఇవ్వడం జరిగిందనీ, గాంధీభవన్ లో మేనిఫెస్టోలో కూడా పెట్టారని, ఆనాటి పిసిసి అధ్యక్షులు ఈనాటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పాటై రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఎంతోమంది ఎమ్మెల్యేలను మంత్రులను అధికారులను కలిసిన లాభం లేకుండా పోయిందనీ, ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు, కాంగ్రెస్ నాయకులు అర్హులైన కళాకారులకు తెలంగాణ సాంస్కృతిక సారధిలో వెయ్యి ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని కోరారు. నిన్న జరిగిన శాసనసభలో సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కళాకారులను ఆదు కుంటామని కాలయాపన మాటలు మాట్లాడారు తప్ప, కళాకారుల బతుకులలో వెలుగులు నింపాలని ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదని తెలుస్తుందన్నారు. ప్రభుత్వం కళాకారులను ఆదుకోకుంటే తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో అన్ని జిల్లాలోని కళాకారులను కలుపుకొని రాష్ట్రస్థాయిలో నిరసన కార్యక్రమం చేపడతామన్నారు.

## కార్మిక చట్టాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి


M/S Amspro Lifesciences Pvt, Ltd., (Sy. No.631/A1)
M/S Amspro Lifesciences Pvt, Ltd., (Sy. No.631/A1)
M/S Amspro Lifesciences Pvt, Ltd., (Sy. No.631/A1)
M/S Amspro Lifesciences Pvt, Ltd., (Sy. No.631/A1)

బాలానగర్ మండలంలోని ఉడిత్యాల గ్రామంలోని ఎంఎస్ ఆమ్స్‌ప్రో లైఫ్‌సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సామాజిక కార్యకర్త జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పరిశ్రమలో గత 4-5 ఏళ్లుగా జనరల్ షిఫ్ట్‌లో సుమారు 150 మంది, ఇతర షిఫ్టుల్లో మరో 40 మంది కార్మికులతో పని చేయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్, కనీస వేతనాలు చెల్లించకుండా కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. సమస్యలను ప్రశ్నించే కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. పరిశ్రమ లేబర్ కార్యాలయంలో నమోదు కాలేదని ఆర్టీఐ ద్వారా సమాచారం అందినట్లు పేర్కొన్నారు. కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరిశ్రమపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

## ఇంజనీరింగ్ అధికారులకు ఘన సన్మానం



**మెదక్ మున్సిపల్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** ఇంజనీరింగ్ డే సందర్భంగా మెదక్ మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులను చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజు, కౌన్సిలర్లు ఘనంగా సన్మానించారు. TPO, TPS, DE, AE అధికారులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

పట్టణ అభివృద్ధి, రహదారులు, డ్రైనేజీ, మౌలిక వసతులు, భవన నిర్మాణ అనుమతులు, అభివృద్ధి పనుల పర్యవేక్షణలో ఇంజనీరింగ్ అధికారుల పాత్ర కీలకమని చైర్మన్ పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## మద్ది శ్రీనివాస్‌రెడ్డికి మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి బాధ్యతలు



**సదాశివపేట, సెప్టెంబర్ (జనంసాక్షి):** తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా సంగారెడ్డి మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ మద్ది శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఈసందర్భంగా మంగళవారం సదాశివపేట మండలం వెంకటాపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ పరిధిలో పార్టీని గ్రామగ్రామాన విస్తరిస్తామని, ప్రతి గ్రామంలో పాంచజన్య సభలు నిర్వహించి పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. తనకు బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షురాలు కవితమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

**సన్మానం:** టిఆర్ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి వేణుమాధవ్, రాష్ట్ర నాయకుడు శంకర్‌నాయక్‌లు శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పరమేశ్వర్, బస్వరాజు, నర్సిములు, బెస్త రాము, శ్రీనివాస్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

## గండిని పూడ్చిన గ్రామస్తులు



**శివ్వంపేట, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గంగయిపల్లి ఊడుగుల చెరువులకు వరద నీరు వచ్చే కట్టుకాలువకు గండి పడింది. దీంతో చెరువులోకి చేరాల్సిన వరద నీరు బయటకు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు ఉపసర్పంచ్ తాటి పవన్‌కుమార్ గుప్తా దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన జేసీబీని తెప్పించి గండి పూడ్చివేత పనులు చేపట్టారు. సొంత ఖర్చులతో మట్టిని పోయించి కాలువకు మరమ్మతులు చేయించారు. వరద నీటి ప్రవాహానికి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టిన ఉపసర్పంచ్‌ను గ్రామస్తులు అభినందించారు. వర్షాలు, వరదల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకుంటామని పవన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మల్లేశం, తలారి శ్రీనివాస్, భాస్కర్, తలారి కృష్ణ, లచ్చున్న గారి నర్సింలు, బొట్టు సురేష్, రైతులు పాల్గొన్నారు.

## సమతుల ఆహారంతో ఆరోగ్యకర జీవనం



**ఉప్పునుంతల, (జనంసాక్షి):** మండలంలోని ఇరట్వానృల్లి గ్రామ పంచాయతీలో మంగళవారం పోషణ మా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి శివ, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, గర్భిణీలు, బాలింతలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన సమతుల ఆహారంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలు, అందుబాటులో ఉన్న కూరగాయలు, ఆకుకూరలను ప్రతిరోజూ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న ఆరోగ్యలక్ష్మి భోజనం, దాని ప్రాధాన్యతను కూడా వివరించారు. ప్రతి ఒక్కరూ పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కోహిర్ ఆసుపత్రిలో వైద్య సేవలపై సమీక్ష

- రెండు షిఫ్టుల్లో ఓపీ నిర్వహణకు చర్యలు
- సీసీ కెమెరాలు, నోటీసు బోర్డు ఏర్పాటు చేయాలి
- సిబ్బందికి అదనపు బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని విజ్ఞప్తి



**కోహిర్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల తీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ హన్నన్ జావేద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజనీ, వైద్యులు, సిబ్బందితో ఆసుపత్రిలోని సమస్యలు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై చర్చించారు.
ఈ సందర్భంగా అబ్దుల్ హన్నన్ జావేద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వైద్యులు ఉదయం వేళల్లోనే అందుబాటులో ఉంటున్నారంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. మండల విస్తీర్ణం, జనాభా దృష్ట్యా ఒక్క షిఫ్ట్‌లోనే ఓపీ నిర్వహించడం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పనులకు వెళ్లే ప్రజలు, దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ప్రయోజనం కలిగేలా సాయంత్రం కూడా ఓపీ సేవలు అందుబాటులో ఉండాలని సూచించారు.
ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలు, వైద్యుల విధులు, ఓపీ సమయాలు తదితర వివరాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేసేందుకు నోటీసు బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. సమాచార లోపంతో రోగులు, వారి బంధువులు ఇబ్బందులు పడకుండా స్పష్టమైన సమాచార వ్యవస్థ ఉండాలని అన్నారు.
ఆసుపత్రి భద్రతను పటిష్టం చేసేందుకు ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ రజనీ సూచించారు. సీసీ కెమెరాలతో రోగులు, సిబ్బందికి భద్రతతో పాటు అనుమానాస్పద ఘటనలను పర్యవేక్షించే అవకాశం ఉంటుందని తెలిపారు.
సుదూర ప్రాంతాల నుంచి విధులకు వచ్చే వైద్యులు, సిబ్బందికి రవాణా ఇబ్బందులు ఉన్నాయని, కోహిర్‌కు అదనపు బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అబ్దుల్ హన్నన్ జావేద్ హామీ ఇచ్చారు. సమావేశంలో టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ ముజఫర్ హుస్సేన్, కౌన్సిలర్ సిరిషా రాణి, సామాజిక కార్యకర్త మహమ్మద్ ఫిర్దౌస్ సర్వార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన





**సదాశివపేట, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** పట్టణంలోని ఉభ చెరువులో వినాయక నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ శివాజీ, చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. గతేడాది కంటే ఈసారి వినాయక శోభాయాత్రను ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించేందుకు భక్తులు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నర్సింలు, షెజ్జీ, అనిత విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఈ రాజేష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అశోక్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మండల అభివృద్ధిలో మరో ముందడుగు

- 4 గ్రామ పంచాయతీ కొత్త భవనాలకు నిధులు మంజూరు
- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేసిన డిఎన్‌ఆర్




**ఉర్కొండ, సెప్టెంబర్ 15(జనంసాక్షి);** మండలంలోని నాలుగు గ్రామాలకు కొత్త గ్రామపంచాయతీ భవనాలు మంజూరయ్యాయి. గ్రామ పంచాయతీ భవనాలు మంజూరైన గ్రామాలలో జకినాలపల్లి, నర్సంపల్లి, గుండ్లగుంటపల్లి, ఇప్పపహాడ్ ఉన్నాయి. ఒక్కొక్క భవనానికి రూ. 20 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్నారు. ఈ భవనాల మంజూరుకు కృషి చేసిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి మండలం తరఫున కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ ద్యాప నిఖిల్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.ఎమ్మెల్యే చొరవతోనే ఈ భవనాలు మంజూరయ్యాయని, దీంతో గ్రామ పరిపాలన మరింత మెరుగుపడుతుందని ఆయన అన్నారు.కొత్త భవనాల మంజూరు పట్ల ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 17న చలో బైరాన్‌పల్లి బైక్ ర్యాలీ

- అమరవీరుల సభను జయప్రదం చేయాలి: సీపీఎం

**కొండపాక, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** సెప్టెంబర్ 17న బైరాన్‌పల్లిలో నిర్వహించనున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, ఉమ్మడి కొండపాక మండల కార్యదర్శి అమ్ముల బాల్ నర్సయ్య పిలుపునిచ్చారు. కొండపాక మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.
**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..** 1946 నుంచి 1951 వరకు సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూస్వాములు, దొరలు, జాగీర్దారులు, నిజాం పాలనకు వ్యతిరేకంగా కొనసాగిందన్నారు. అనంతరం యూనియన్ సైన్యాలతోనూ పోరాటం కొనసాగిందని తెలిపారు. కుల, మత, ప్రాంత, భాషలకు అతీతంగా ప్రజలు ఉద్యమంలో భాగస్వాములయ్యారని, సుమారు 4,500 మంది ప్రాణ త్యాగం చేశారని, 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని పేర్కొన్నారు. 8,500 మంది పోరాట యోధులు జైలుశిక్ష అనుభవించారని గుర్తు చేశారు.
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆర్ఎస్ఎస్, బీజేపీకి ఎలాంటి పాత్ర లేదని ఆయన అన్నారు. చరిత్రను వక్రీకరించి పోరాటాన్ని హిందూ–ముస్లిం ఘర్షణగా చిత్రీకరించడం ద్వారా ప్రజల్లో విభజన సృష్టించేందుకు మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్యతో పాటు ఎందరో త్యాగధనులు పోరాడారని తెలిపారు.
బైరాన్‌పల్లిలో 96 మందిని ఒకేరోజు హతమార్చిన ఘటనను గుర్తుచేసిన ఆయన, అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే సభకు కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.



బైరాన్‌పల్లిలో జరిగే సభకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. వెలికట్ట చౌరస్తా నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గడ్డమీది ఐలయ్య, గజబింకర్ బాలకిషన్, సీఐటీయూ నాయకులు బర్మ కొమురయ్య, ఆరుట్ల సర్పంలు తదితరులు పాల్గొన్నారు.

## హిందీ భాషా ప్రాధాన్యతను చాటిచెప్పిన హిందీ దినోత్సవం



**కొల్చారం, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** కొల్చారం మండలంలోని రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ.. హిందీ భాష భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిందన్నారు.
హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందీ ఉపాధ్యాయులు ధరావత్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కవితలు, దోహాలు, పద్యాలు, వ్యాసరచన, పెయింటింగ్ తదితర పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

## సెయింట్ ఆంథోనీస్‌లో ఘనంగా హిందీ దినోత్సవం




**సంగారెడ్డి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పాటలు, నృత్యాలు, ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. డైరెక్టర్ ఈ. విజయ్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఈ. అరుణా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎల్. ప్రదీప్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. హిందీ దేశ ప్రజల మధ్య అనుసంధాన భాషగా నిలుస్తుందని, విద్యార్థులు భాషను నేర్చుకోవాలని విజయ్ రెడ్డి సూచించారు. వివిధ పోటీల విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. రాష్ట్రస్థాయి జానపద, శాస్త్రీయ నృత్య పోటీల్లో ప్రథమస్థానం సాధించిన నాలుగో తరగతి విద్యార్థిని జె.రితికను ప్రత్యేకంగా అభినందించారు.

## మహేశ్ గుప్తా సహకారం మరువలేనిది



**శివ్వంపేట, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** ఆపదలో ఉన్న ప్రజలకు మాజీ జడ్పీటీసీ పబ్బా మహేశ్ గుప్తా అండగా నిలుస్తున్నారని బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు బాలకుంట ఇంద్రేష్ అన్నారు. నవాబ్‌పేట గ్రామానికి చెందిన ఎండీ సలీం భార్య ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మహేశ్ గుప్తా బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.
ఈ సందర్భంగా ఇంద్రేష్ మాట్లాడుతూ మండలంలోని గ్రామాలు, గిరిజన తండాల్లో ఎవరికైనా ఆపద వచ్చినప్పుడు మహేశ్ గుప్తా సహాయం చేస్తున్నారని కొనియాడారు. నవాబ్‌పేటలో పలువురు బాధిత కుటుంబాలకు సహకారం అందిస్తున్న ఆయనకు గ్రామస్థుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సలీం, షాహేద్, నవాజ్, హైమద్, బాబా, జాహీద్, రసీదా తదితరులు పాల్గొన్నారు.

# మార్డి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ - ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి

- నల్లవాగుపై బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలు సిగ్గుచేటు





**కల్హేర్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** కల్హేర్ మండలం మార్డి గ్రామంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా నారాయణఖేడ్ శాసన సభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి హాజరై లబ్ధిదారు లకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.సంజీవరెడ్డి మాట్లా డుతూ...** సంగారెడ్డి జిల్లా నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభం కావడం ఎంతో సంతోషకరమన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేస్తోందని తెలిపారు.దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.నల్లవాగు నీరు,కాలువల విషయంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు.పదేళ్లు అధికారం లో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కాలువల పూడిక తీయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే కాలువల పూడికతీత, బుష్ కటింగ్ పనులు చేపట్టి నీటి పారుదల వ్యవస్థను పటిష్టం చేశామని అన్నారు. నల్లవాగు ప్రాజెక్టు పేరుతో గత ప్రభుత్వ హయాంలో లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం జరి గిందని, అవినీతి చోటుచేసుకుందని ఆరోపించారు. రైతుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు.

ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున రైతులు నీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకు వినియో గించుకోవాలని సూచించారు. పంటలకు అవసర మైన సమయంలో సాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్య క్రమంలో మార్డి సర్పంచ్ విజలక్ష్మి రవీందర్ రెడ్డి, కల్హేర్ మండల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.

## కర్ర రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొన్నం



**కోహెడ, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** మండలంలోని శనిగరం గ్రామంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పర్యటిం చారు. శనిగరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్ర రాజశేఖర్ తల్లి కర్ర లక్ష్మీబాయి ఇటీవల మృతి చెందగా వారి నివాసాని కి వెళ్లి, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కర్ర రాజశేఖర్‌తోపాటు కుటుంబ సభ్యులను మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించి లక్ష్మీబాయి మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. లక్ష్మీబాయి గారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షులు శెట్టి సుధాకర్, పార్టీ మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడిగా శేఖర్ గౌడ్



**కొల్చారం, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** కొల్చారం మండలం ఏడు పాయల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి పిలుపు మేరకు సమావేశం నిర్వహించారు. సాంస్కృతిక సారథులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి మెదక్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా శివ్వోళ్ల కృష్ణ, అధ్యక్షుడిగా కొమ్ముల శేఖర్ గౌడ్, కార్య దర్శిగా నేనావత్ మదన్ సింగ్, కోశాధికారిగా కారంగుల మాధవి, ఉపాధ్యక్షుడిగా ధరావత్ రాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సాంస్కృతిక సారథుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పనిచేస్తామని, హక్కుల సాధన కోసం సమిష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

## గణేష్ మండప నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి: సీఐ శివశంకర్



**నారాయణపేట, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని సుభాష్ రోడ్డులో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను సీఐ శివశంకర్, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. మండపాల వద్ద నిర్వహిస్తున్న పాయింట్ బుక్స్‌ను తనిఖీ చేసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. 24 గంటలూ కనీసం ఇద్దరు నిర్వాహకులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ చర్యలు చేపట్టి విద్యుత్ వైర్లు, షార్ట్‌సర్క్యూట్ తదితర ప్రమాదాలకు అవకాశం లేకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

విగ్రహాలు, మండపాల వద్ద చోరీలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్రమశిక్షణతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. మండపాల వద్ద మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. శోభాయాత్రలు, ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. రాత్రి 10 గంటల తర్వాత సౌండ్ బాక్సులు నిలిపివేసి శబ్ద నియంత్రణ నిబంధనలు పాటించాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ కోరారు.

# ఓం సాయి వెంకటరమణ రైస్ మిల్లులో విజిలెన్స్ తనిఖీలు



**శివ్వంపేట, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** శివ్వంపేట మండల కేంద్రం శివారులోని ఓం సాయి వెంకటరమణ రైస్ మిల్లులో విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మిల్లులోని ధాన్యం, బియ్యం నిల్వలు, మిల్లింగ్‌కు సంబంధించిన రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, ఇతర పత్రాలను అధికారులు పరిశీలించారు. రికార్డుల్లో నమోదైన నిల్వలకు, మిల్లులో వాస్తవంగా ఉన్న నిల్వలకు మధ్య తేడాలు ఉన్నాయా అనే అంశంపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వం ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని నూర్పిడి కోసం రైస్ మిల్లులకు కేటా యిస్తుంది. ఒప్పందాల ప్రకారం మిల్లర్లు ప్రతి క్వింటాల్ ధాన్యానికి నిర్దేశిత పరిమాణంలో బియ్యా న్ని ఎఫ్‌సీఐకి అందించాల్సి ఉంటుంది. అయితే కొందరు మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని సకాలంలో అందించకుండా ధాన్యం తడిసిపోయిం దని, పందికొక్కులు తిన్నాయని తదితర కారణాలు చెబుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యం లో మిల్లుల్లో నిల్వలు, రికార్డులపై తనిఖీలు ప్రాధా న్యత సంతరించుకున్నాయి.

విజిలెన్స్ అధికారులు మిల్లుకు సంబంధించిన పత్రాలను పరిశీలిస్తూ పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. తనిఖీలకు సంబంధించిన అధికారిక వివరాలను అధికారులు వెల్లడించాల్సి ఉంది. పరిశీలన అనంతరం ఏవైనా అక్రమాలు, నిల్వల్లో తేడాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారా అనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మిల్లులో విజిలెన్స్ తనిఖీలకు కారణం, అధికారులు గుర్తించిన అంశాలు, తదుపరి చర్యలపై అధికారిక నివేదిక వెలువడాల్సి ఉంది.

## నిమజ్జనం ఎరుగని గణేష్ కు నామాజీ ప్రత్యేక పూజలు



**నారాయణపేట సెప్టెంబర్ 15(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రం, పరిమళ పురం (పళ్ళ)లోని మాజీ జనసంఘ సభ్యులు కీ.శే ఘన్నంజయ్ దీక్షిత్ నివాసం లో వెలసిన 803 సంవత్సరాల నాటి మట్టి విగ్రహాని దర్శించి బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నాలు తొలగించి సమృద్ధిని ప్రసాదించా లని వేడుకున్నారు. ఈ సందర్భంగా పండిట్ విద్యాధర్ దీక్షిత్ నాగురావును శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసి కన్వీనర్ వెంకటయ్య, బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ కిరణ్ ధగే తదితరులు పాల్గొన్నారు.

## నాబార్డ్ నిధులతో వరి విత్తనోత్పత్తి క్షేత్రాల పరిశీలన



**నారాయణపేట, సెప్టెంబర్ 15 (జనం సాక్షి):** నాబార్డ్ నిధులతో చేపట్టిన వరి విత్తనోత్పత్తి కార్యక్రమంలో భాగంగా తీలేర్, నర్వ మండలాల్లోని విత్తనోత్పత్తి వరి క్షేత్రాలను తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం నారాయణపేట శాస్త్రవేత్త, సమ న్వయకర్త డా.ఈటెల సత్యనారాయణ పరిశీలించారు.ఈ సందర్భంగా వరి పంటలు ప్రస్తుతం చురుకైన పిలకల దశలో ఉన్నట్లు గుర్తించారు. పంటల స్థితిగతులను పరిశీలించిన అనంతరం రైతులకు ఎరువుల వినియోగం, సమతుల్య పోషక యాజమాన్యం, తెగుళ్లు మరియు పురు గుల నివారణ చర్యలపై శాస్త్రీయ సూచనలు చేశారు. విత్తనోత్పత్తి క్షేత్రాల్లో పంటను ఆరోగ్యంగా నిర్వ హిస్తూ, నాణ్యమైన విత్తనోత్పత్తికి అవసరమైన సమగ్ర పంట యాజమాన్య పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు.నాబార్డ్ సహకారంతో చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా రైతులకు నాణ్యమైన వరి విత్తనాన్ని అందుబాటులోకి తీసుకు రావడంతో పాటు, స్థానికంగా విత్తనోత్పత్తిని ప్రోత్సహించేందుకు కృషి చేస్తోందని డా.ఈటెల సత్యనారా యణ తెలిపారు.

## జడ్చర్లలో ఘనంగా గణనాథుల ప్రతిష్ఠాపన

**జడ్చర్ల, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని వాడవాడలా వినాయక చవితి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యా యి. సోమవారం వివిధ మండపాల్లో గణనాథులను ప్రతిష్ఠించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, పండితుల వేద మంత్రోచ్ఛారణల నడుమ స్వామివారిని కొలువుదీర్చారు. మండపాలను విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు.

పూజల అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రత్యేక అర్చనలు, సాంస్కృతిక ప్రదర్శనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వ హించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోగా, ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా మున్సిపల్ అధికారులు, పోలీసులు తగిన బందోబస్తు చర్యలు చేపట్టారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**రాయికోడ్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య అన్నారు. మంగళవారం రాయికోడ్ తెలంగాణ మోడల్ స్కూల్‌లో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్ అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను గుర్తించి సన్మానించడం ద్వారా వారిలో మరింత ఉత్సాహం కలుగుతుందన్నారు.

ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో ఎంఈఓ నర్సింలు, అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. పెద్ద శంకరంపేట్ మండలం రామోజీపల్లి రైతు వేదికలో రామోజీపల్లి, వీరోజిపల్లి, జుకల్, సంగారెడ్డి గ్రామాల లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. స్మార్ట్ కార్డులతో నిత్యావసర సరుకుల పంపిణీ మరింత పారదర్శకంగా, సులభంగా జరుగుతుందని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. పలువురు లబ్ధిదారులకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులను కూడా అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం... ఎమ్మెల్యే సంజీవరెడ్డి..



**పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని జమున నాయక్ తండాలో 20 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని పేర్కొన్నారు. జమున నాయక్ తండాలో లబ్ధిదారుల ఇంద్ర మహిళ గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విట్టల్ నాయక్. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు..

## పీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శిగా ధోనే వెంకటేశ్వరరావు

**బెజ్జంకి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన బెజ్జంకి గ్రామానికి చెందిన ధోనే వెంకటేశ్వరరావును కాంగ్రెస్ పార్టీ బెజ్జంకి మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పదవికి బెజ్జంకి గ్రామానికి చెందిన ధోనే వెంకటేశ్వరరావు ఎంపిక కావడం సంతోషకరమని అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు ఆడుకుని నర్సింగరావు,గంగాధర రామచంద్రం,టౌన్ అధ్యక్షుడు కత్తి రమేష్, రావుల నర్సయ్య,ఇప్పిల్ల ఐలయ్య,పర్స సంతోష్, బండి వేణు, ఆయిలేని మహేందర్ రెడ్డి, పుర్మనారాయణ రెడ్డి, గుండని ఎల్లయ్య,సంగ రమేష్, గుబురే చంద్రం, కర్రావుల శంకర్,దొమ్మట శ్రీహరి, మహంకాళి మోహన్, నిషాని అనిల్,రొడ్డ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పిడుగు పాటుకు పాడి ఆవు మృతి



**కోహెడ, సెప్టెంబర్ 14 (జనంసాక్షి):** మండలంలోని తంగళ్ళపల్లి గ్రామంలో సోమవారం వేకుజామున ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగు పడి గ్రామానికి చెందిన ముప్పిడి తిరుపతిరెడ్డికి చెందిన పాడి ఆవు మృతి చెందింది. కుటుంబానికి జీవనాధారమైన గేదె చనిపోగా మమ్ముల్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నారు ఆవు సుమారు 60 వేయిల రూపాయలు ఉంటుందని తన కుటుంబ పోషణకు పెద్ద దిక్కైనటువంటి గేదే చనిపోగా గేదె మృతి పట్ల రైతు కన్నీరు పెట్టున్నాడు వెంటనే రైతును ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు గ్రామస్తులు కోరుతున్నారు.

## పాము కాటుకు గురై పాడిగేదె మృతి



**చేర్యాల, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** పాము కాటుకు గురై పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని చుంచనకోట గ్రామంలో చోటుచేసుకుంది. రైతు ఏషబోయిన సంజీవులుకు చెందిన పాడి గేదె తన వ్యవసాయ క్షేత్రంలో మేత మేస్తున్న క్రమంలో పాముకాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు 40 వేల నష్టం ఉంటుందన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి తనను ఆదుకోవాలని కోరారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన శనిగరం విద్యార్థినిలు



**కోహెడ సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల గజ్వేల్‌లో నిర్వహించిన అండర్ 16 సబ్ జూనియర్ బాలికల విభాగంలో నిర్వహించిన కబడ్డీ పోటీలలో శనిగరం ఉన్నత పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థినిలు ఎన్.హర్షిత, జి.శ్రీలేఖ, టి. ఆరాధ్యలు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం సరళ, వ్యాయామ ఉపాధ్యాయురాలు చక్రం రమ్య లు తెలిపారు. ఈనెల 26 నుండి రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో ఈ ముగ్గురు విద్యార్థునిలు పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయిన విద్యార్థినిలను, వీరికి శిక్షణను ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు చక్రం రమ్యను ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై దాడి యత్నంపై కేసులు పెట్టాలి



**కొండపాక, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై దాడికి యత్నించిన వారిపై కేసులు ఎందుకు నమోదు చేయలేదని కొండపాక వైస్‌చైర్మన్ దేవి రవీందర్ ప్రశ్నించారు.

ఈ ఘటన వెనుక రాజకీయ ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలనే డిమాండ్ నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఫామ్‌హౌస్ వద్ద రాజకీయ డ్రామాకు తెరలేపారని ఆరోపించారు. దళితులకు రూ.12 లక్షల సాయం, యువతకు రుణాలు, బీసీ బంధు వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. ఎస్సీ, బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి, గొర్రెల పంపిణీ, చేప పిల్లల పంపిణీ వంటి పథకాలతో బడుగు వర్గాలకు అండగా నిలిచిందన్నారు. హామీలు అమలు చేయలేకపోతే సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేసి ప్రజల తీర్పు కోరాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** సిద్దిపేట 29వ వార్డు నసీర్‌నగర్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ చైర్మన్ ఎం.డి. రియాజ్ ఉద్దీన్ (రషద్) ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. పాత పోస్టాఫీస్ సమీపంలోని 39వ రేషన్ షాప్ వద్ద కార్యక్రమం నిర్వహించారు.



ఈ సందర్భంగా రషద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో వార్డు అధికారి పూజ, ఫీల్డ్ ఆఫీసర్ భాను, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ వహాబ్, ఎం.డి. అతీఫ్ తదితరులు పాల్గొన్నారు. కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

## గుంతలమయమైన రహదారులు.. ప్రమాదాలకు ఆహ్వానం



**తెలకపల్లి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఈర్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వర్షాలతో గుంతల్లో నీరు నిలిచి రహదారులు మరింత అధ్వానంగా మారుతున్నాయని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే రహదారులను పరిశీలించి గుంతలను పూడ్చడంతో పాటు అవసరమైన చోట శాశ్వత మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ తరఫున కృషి చేస్తామని తెలిపారు.

## గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 15(జనంసాక్షి):** 2026గణపతి నవరాత్రులను పురస్కరించుకొని సిద్దిపేట పట్టణంలోని ప్రధాన చెరువులు అయినటువంటి కోమటి చెరువు, ఎర్ర చెరువు, నర్సాపూర్ చెరువులను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ మంగళవారం పరిశీలించారు. గణేష్ నిమజ్జనాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అధికారులు చేపడుతున్న ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెరువుల వద్ద ఏర్పాటు చేస్తున్న విద్యుత్ దీపాలంకరణ, నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు, వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాల్సిన భద్రతా పరికరాలు, ఇతర మౌలిక వసతులపై కమిషనర్ అధికారులతో చర్చించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.మున్సిపల్ అధికారులు, పోలీసు సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. భక్తులు, గణేష్ మండపాల నిర్వాహకులకు అవసరమైన సూచనలు అందిస్తూ, నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ మాట్లాడుతూ.. అధికారులు సూచించిన, ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రదేశాల్లోనే గణపతి విగ్రహాలను నిమజ్జనం చేయాలని సూచించారు. ఎవరూ తమ ఇష్టానుసారంగా చెరువుల్లోని ఇతర ప్రాంతాల్లో నిమజ్జనం చేయరాదని, చెరువుల్లోని లోతైన ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.

నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేందుకు మున్సిపల్ మరియు పోలీసు అధికారులు అందించే సూచనలను ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పాటించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గజాయితగాళ్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.కార్యక్రమంలో డీఈ ప్రేరణ పాండా, ఏఈలు పృథ్వీ,జమీల్ అహ్మద్, సానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్,ఇంచార్జి శానిటరి ఇన్స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నాళ్లీ నరకం..!

- అధ్వానంగా నిజాంపూర్ ఆర్ అండ్ బి రోడ్
- వర్షాలు కురిస్తే ప్రజలకు తప్పని నరకయాతన
- ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు
- పాలకుల అసమర్థతపై ప్రజల్లో ఆగ్రహం



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 15(జనంసాక్షి):** సంగారెడ్డి నియోజకవర్గం సదాశివపేట మండలం నిజాంపూర్ వెళ్లే ఆర్ అండ్ బి రహదారీ దుస్థితి పాలకుల పనితీరుకు అద్దం పడుతోంది. ప్రధాన రహదారులు, రోడ్లు గుంతలమయంగా మారి ప్రజలకు నరకయాతన కలిగిస్తున్నా సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు విమర్శిస్తున్నారు.

**ప్రమాదాలకు నిలయంగా మారిన రహదారి...**

సదాశివపేట నుండి నిజాంపూర్ గ్రామానికి వెళ్లే ఆర్ అండ్ బి రహదారి చాల చోట్ల గోతులు పడి ప్రమాదకరంగా మారింది. రాత్రి



వేళల్లో ఎక్కడ గుంత ఉందో చూసుకోవాల్సిందే. ఆదమరిచి ప్రయాణం సాగిస్తే ఎ గుంతలోనైనా పడి గాయాల పాలు కావాల్సిందే. నిరంతరం నిజాంపూర్ రహదారిపై వాహనాల సంచారం జరుగుతుంది. నిత్యం గ్రామం నుంచి సదాశివపేట పట్టణానికి వివిధ వ్యాపారం నిమిత్తం వ్యాపారులు, పాఠశాల, కళాశాలలాకు వెళ్లేందుకు విద్యార్థులు ఈ రహదారి మార్గంలో వెళ్లాల్సిందే.. గర్భిణులు, బాలింతలను ఆసుపత్రికి తీసుకువెళ్లాలన్నా నానా అవస్థలు పడుతున్నామని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిజాంపూర్ నుండి సదాశివపేట వెళ్లే మార్గంలో కిలోమీటర్ పైన చాలా చోట్ల పెద్ద పెద్ద గుంతలు, గుంతల్లో నీళ్లు నిలిచి ఉన్నాయి. దీంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లలో వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారింది. రోడ్డుకు తాత్కాలికంగా అప్పుడప్పుడు చిన్నపాటి ప్యాచ్‌వర్క్‌లు చేసినప్పటికీ అవి మూడు రోజుల ముచ్చటగానే మారిపోయాయి. వందలాది వాహనాలు ప్రయాణించే రహదారి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రం జాగ్రత్తలు చెబుతున్న అధికారులు రహదారులు ధ్వంసమవుతున్న విషయాలు పట్టించుకోవటం. రహదారిపై ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నామని, నూతన రహదారి నిర్మాణం చేపట్టాలని, లేకుండా అడుగడుగునా గోతులు పడిన రహదారికి మరమ్మత్తులైనా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి



**మెదక్ టౌన్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** మెదక్ పట్టణంలో గణేష్ నిమజ్జనానికి సంబంధించి కొంటూరు చెరువులో చేపటాల్సిన ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజు పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ వై. నవీన్, డీఎస్పీ, రూరల్ సీఐ, ఎలక్ట్రికల్ ఏఈడీ, మున్సిపల్ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో సమీక్షించారు.

**ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ...** పెద్ద సంఖ్యలో భక్తులు, గణేష్ మండపాల నిర్వాహకులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువు వద్ద విద్యుత్ స్తంభాలు, అదనపు లైటింగ్, బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తుల భద్రతతో పాటు వాహనాల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించి చెత్త పేరుకు పోకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్, మున్సిపల్, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేసి నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు.

# పసుపు నీళ్ల ఘటనలో ఆరుగురికి రిమాండ్

**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళితులు తిరిగారంటూ పసుపు నీళ్లతో శుద్ధి చేసిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. దళితులను అవమానించారంటూ కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో వరదరాజ్‌పూర్ మాజీ సర్పంచ్‌తో పాటు ఆరుగురు బీఆర్ఎస్ నాయకులను సోమవారం విజయవాడలో పోలీసులు అదుపులోకి తీసుకుని గజ్వేల్‌కు తరలించినట్లు సమాచారం.

నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం వారిని సిద్దిపేట జిల్లా జైలుకు తరలించారు.

కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో ఘటనకు సంబంధించిన ఫోరెన్సిక్ ఆధారాలను పోలీసులు ఇప్పటికే సేకరించారు.

# నంగునూరు మండల వ్యాప్తంగా మిన్నంటిన గణనాథుని ఉత్సవ శోభ

- భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు

**నంగునూరు, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** నంగునూరు మండల వ్యాప్తంగా సోమవారం రోజు వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ, భక్తులు గణనాథుడిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు, యువత ఉత్సాహం గా ప్రతి వీధిలోనూ, చౌరస్తాల్లోనూ యువకులు, చిన్నారులు కలిసి గణపతి మంటపాలను రంగురంగుల విద్యుత్ దీపాలు, తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు.

**భక్తిశ్రద్ధలతో పూజలు...**

ఉదయాన్నే భక్తులు వేకువజామునే లేచి, పవిత్ర స్నానాలు ఆచరించి తమ అభిమాన దేవునికి పత్రి, పూలు, మోదకాలు సమర్పించి ప్రత్యేక హారతులు ఇచ్చారు.

అన్ని గ్రామాల్లో చిన్న పెద్ద తేడా లేకుండా గ్రామీణులంతా ఏకమై ప్రతిష్ఠించిన లంబోదరుని విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**ఆధ్యాత్మిక వాతావరణం...**

మంటపాల వద్ద గణపతి బప్పా మోరియా నామస్మరణలు, మైకుల్లో మ్రోగుతున్న భక్తిపాటలతో మండలమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మంటపాలను



సందర్శించి గణనాథుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాబోయే నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసు కుంటున్నారు.

**ఉచితంగా మట్టి విగ్రహాల పంపిణీ...**

పర్యావరణహితం నంగునూరు మండలం కేంద్రంలో స్వయంగా సాదుల రాజు తయారు చేసిన మట్టి విగ్రహాలను రాజగోపాల్‌పేట ఎస్సై వివేక్,పిఎసిఎస్ చైర్మన్ కోల రమేష్ గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్, సర్పంచ్ బాల పోశయ్య, ఉప సర్పంచ్ శ్రీధర్ గౌడ్ మాజీ ప్రజాప్రతినిధులు చౌడిచర్ల జైపాల్ రెడ్డి, మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలు అందించిన సాదుల రాజును అభినందించారు.

# రైతులకు సమగ్ర పంటల యాజమాన్యంపై శిక్షణ



**ఎర్రవల్లి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** పూటాన్‌దొడ్డి రైతువేదికలో వ్యవసాయ శాఖ, జోగులాంబ గద్వాల జిల్లా ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారి సురేష్‌గౌడ్ సమగ్ర పోషక యాజమాన్యం, పురుగులు, తెగుళ్ల నివారణ, నీటి యాజమాన్యంపై సూచనలు ఇచ్చారు. ఎల్‌నినో పరిస్థితులను తట్టుకునేందుకు నీటి సంరక్షణ చేపట్టాలని, పొలాల్లో ఊటకుంటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మిశ్రమ, అంతర, కంచ పంటలతో అధిక దిగుబడులు, ఆదాయం పొందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంలో జీవామృతం, బీజామృతం, అగ్నియాస్త్రాలను స్వయంగా తయారు చేసుకుని వినియోగించాలని తెలిపారు. మినుములు, పెసర, అలసంద వంటి స్వల్పకాలిక పంటలు సాగు చేయాలని సూచించారు. ఆత్మ అధికారి జగ్గునాయక్ రసాయన ఎరువులను తక్కువగా వాడి నానో యూరియా వినియోగించాలని సూచించారు. జాతీయ నూనెగింజల మిషన్‌లో భాగంగా వేరుశనగ విత్తనాలను 100 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో కరుణశ్రీ, ఏఈవోలు విజయ్, మోహన్, నరేష్, రైతులు, కృషిసఖీలు పాల్గొన్నారు.

# భారత్‌మాలపై భగ్గుమన్న రాజోళి

- జాతీయ రహదారిపై బైఠాయింపు
- సర్వీస్ రోడ్డు ఇవ్వాల్సిందేనంటూ ధర్నా
- అధికారుల హామీతో ఆందోళన విరమణ



**రాజోళి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** సర్వీస్ రోడ్డు ఇవ్వకపోతే ఊరుకునేది లేదంటూ రాజోలి ప్రజలు ఒక్కసారిగా రోడ్డెక్కారు. భారత్‌మాల ఆరువరసుల జాతీయ రహదారిపై రెండువందల మందికి పైగా ప్రజలు బైఠాయించి ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాతో రహదారిపై కదలిక ఆగిపోయింది. జాతీయ రహదారి వస్తే గ్రామానికి అభివృద్ధి, అత్యవసర వైద్యం, వ్యాపార రాకపోకలు సులభమవుతాయని ఆశించి భూములు ఇచ్చామని ప్రజలు తెలిపారు. ప్రస్తుతం పొలాలకు వెళ్లే సర్వీస్ రోడ్డు అధ్వానంగా మారడంతో వ్యవసాయ పరికరాలు తీసుకెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు మండల కేంద్రాలు, మూడు రాష్ట్రాలను కలిపే ప్రధాన రహదారి నుంచి రాజోలికి లింక్ రోడ్డు ఇవ్వాలని ఎన్నిసార్లు అధికారులకు వినతులు ఇచ్చినా స్పందన లేకపోవడంతోనే ప్రత్యక్ష ఆందోళనకు దిగామని ప్రజలు తేల్చిచెప్పారు. న్యాయం జరిగే వరకు కదిలేది లేదని భీష్మించారు. విషయం తెలియగానే తహసీల్దార్ రామ్మోహన్, ఎస్సై కిరణ్‌కుమార్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులతో చర్చించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ప్రజలు ధర్నా విరమించారు. ఇదే సమయంలో భారత్‌మాల అధికారులు రంగంలోకి దిగారు. ప్రజల విజ్ఞప్తి మేరకు మూసివేసిన రక్షణ దిమ్మెలను తొలగించారు. దీంతో తాత్కాలికంగా రాకపోకలకు మార్గం ఏర్పడింది. ధర్నాలో సర్పంచి గంగిరెడ్డి, ఉప సర్పంచి సంధ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు యల్లారెడ్డి, మండలాధ్యక్షుడు హసే దస్తగిరి, జయన్న, మూగెన్న, వెంకటేశ్వర్లు, గోవర్ధన్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



**రేవల్లి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ (ఎన్ఎంఎన్ఎఫ్)లో భాగంగా రేవల్లి మండలం తల్పునూర్ క్లస్టర్‌లో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఎన్ఎంఎన్ఎఫ్ కిట్లను పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారి మనిచందర్, ఏఈఓలు సురేష్, రేవతి, శిల్ప రైతులకు సహజ పద్ధతుల్లో సాగు, నేల ఆరోగ్య పరిరక్షణ, రసాయన ఎరువుల వినియోగం తగ్గింపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో సాగు ఖర్చులు తగ్గడంతో పాటు నేల, పర్యావరణ పరిరక్షణకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ చైర్మన్ ఎక్కే వెంకటేష్, సర్పంచులు బాదేపల్లి రేవతి, శ్రీనునాయక్, లోడే అంజలమ్మ, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలాలు అందించి, ఇళ్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇంటి స్థలాలు పొందని పలువురు జర్నలిస్టులు ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొంతమందికి ఇంటి స్థలాలు కేటాయించినప్పటికీ, ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని తెలిపారు. ప్రస్తుతం అర్హులందరికీ స్థలాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.
జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్థలాల కేటాయింపులో పారదర్శకత పాటిస్తామని స్పష్టం చేశారు. అర్హత ఆధారంగానే, ఎలాంటి డబ్బులు తీసుకోకుండా స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి కూడా ప్రభుత్వ సహకారం అందేలా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే హామీపై జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో ప్రయోజనాలు





**వడ్డేపల్లి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** వడ్డేపల్లి... ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు అన్నారు. మంగళవారం వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రిక్రియేషన్ లర్నింగ్ పేరుతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం కు సంబంధించి పలు అంశాలపై రైతులకు సలహాలు సూచనలు అందించారు. ప్రధాన పంటల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలు నానో ఎరువుల ఉపయోగం వరిలో ఎంపిక చేసిన రకాల సాగుపై శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయ ప్రయోజనాలు సాగులో మెలకువలు ఎరువుల వాడకం పంటకు తగిన పరిమాణం లాంటి అంశాలపై పూర్తి అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇచ్చారు అనంతరం శిక్షణలో పాల్గొన్న రైతులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి రాధా, ఏవో నాగేశ్వరరావు, ఆర్టికల్చర్ అధికారి ఇమ్రాన్, కోరమాండల్ ఆగ్రోణమిష్టు, హరిప్రియ పాల్గొన్నారు.

## మండపాల్లో కొలువుదీరిన విఘ్నేశ్వరుడు

**మహమ్మదాబాద్, సెప్టెంబర్ 14 (జనంసాక్షి):** మహమ్మదాబాద్ మండలవ్యాప్తంగా సోమవారం గణేశ్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ గ్రామాల్లో మండపాలను అందంగా అలంకరించి గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉదయం నుంచే భక్తులు మండపాలకు చేరుకుని పూలు, పత్రి, ఉండ్రాళ్లు, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడి నామస్మరణతో గ్రామాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. రానున్న తొమ్మిది రోజులపాటు మండపాల్లో ప్రత్యేక పూజలు, భజనలు, భక్తి కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

**గణనాథుడికి 11 కేజీల లడ్డూ సమర్పణ...**

గాధిర్యాల్ గ్రామానికి చెందిన బద్దుల కుటుంబ సభ్యులు వరుసగా రెండోసారి గణనాథుడికి 11 కేజీల లడ్డూను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు పౌష్టికాహారం అవసరం



**తెలకపల్లి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** పోషణ అంటే ఆకలి తీర్చడం మాత్రమే కాదని, ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మించడమే లక్ష్యమని జిల్లా మహిళా సాధికారత జనరల్ స్పెషలిస్ట్ సునీత, అంగన్వాడీ సూపర్వైజర్ పద్మ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసోత్సవంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.
శిశువులకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. అనంతరం కూరగాయలు, పండ్లు, మిల్లెట్స్‌తో కూడిన వైవిధ్యమైన ఆహారం అందించాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని ఐరన్-ఫోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సందీప్‌రెడ్డి, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన



**మిడ్జిల్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు వల్లభరావుపల్లి, రాణిపేట గ్రామాల్లో రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పించారు. జానపద పాటల ద్వారా ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే పరిస్థితుల్లో ఆరుతడి పంటలు సాగు చేసి ఆదాయం పొందాలని సూచించారు. రైతులు అప్పుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలకు పాల్పడవద్దని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు కొమ్ము కృష్ణ, బండారి రవిశంకర్, కిందింటి కిరణ్, నరేందర్, శివ, సికిందర్, అరుణ, కవితతో పాటు కాంగ్రెస్ నాయకులు గౌస్, సాయిలు, సత్యం గౌడ్, సర్పంచులు మల్లేష్, కృష్ణ, రాము గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు



**గద్వాల, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** స్థానిక విశ్వేశ్వరయ్య పాఠశాలలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి, ఇంజనీర్ల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ పి. సాయిబాబా, ప్రిన్సిపాల్ భారతి ఫ్రాన్సిస్, హెడ్‌మాస్టర్ ఈ. కిషోర్‌కుమార్ గౌడ్, గంజ్ కమిటీ సభ్యులు విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విశ్వేశ్వరయ్య కృష్ణరాజసాగర్ డ్యామ్, హైదరాబాద్‌లో వరదల నివారణ వ్యవస్థల నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని సాయిబాబా తెలిపారు. ఆయన క్రమశిక్షణ, సమయపాలన విద్యార్థులకు ఆదర్శమన్నారు. ఆయన అంకితభావాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి

- **తహసీల్దార్‌కు బీజేపీ మండల శాఖ వినతిపత్రం**



**వనపర్తి రూరల్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ వనపర్తి మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ ఎం. రమేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు సంద వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ తెలంగాణ రజాకారుల పాలనలో కొనసాగిందని, విముక్తి కోసం రైతులు, మహిళలు, యువత, సామాన్య ప్రజలు పోరాడి త్యాగాలు చేశారని తెలిపారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆపరేషన్ పోలో అనంతరం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రను రాజకీయ ప్రయోజనాల కోసం విస్మరించడం తగదని బీజేపీ నాయకులు అన్నారు. అమరుల త్యాగాలను గౌరవిస్తూ సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించి, భావితరాలకు తెలంగాణ విమోచన చరిత్రను అందించాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17ను ఘనంగా అధికారికంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతూరి బుచ్చన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, రూరల్ మండల ప్రధాన కార్యదర్శి వాకిటి సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు బత్తిని మధుసూదన్, వారాల సంపత్, రెడ్యానాయక్, మండల కార్యదర్శులు, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు వస్య రామ్, డి.సత్యనారాయణరావు, కే.వెంకటేష్ నాయక్, చిన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అధికార మదంతో రైతులను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం- టీఆర్ఎస్



**గద్వాల, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** రాష్ట్రంలో 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తామని గద్దెనెక్కి రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని తెలంగాణ రక్షణ సేన గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగళ్ల రంజిత్ కుమార్ ఆరోపించారు.మంగళవారం గద్వాల పట్టణంలోని నదీ అగ్రహారం రోడ్డులో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఎస్ఈ కార్యాలయం ముందు విద్యుత్ కోతలు, లో ఓల్టేజ్ సమస్యలకు నిరసనగా టీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ఉచిత విద్యుత్ సంగతి దేవుడెరుగు, ఉన్న కరెంట్ కూడా సరిగా ఇవ్వడం లేదని, అర్ధరాత్రి ఇచ్చే తక్కువ వోల్టేజ్ వల్ల మోటార్లు కాలిపోయి రైతులపై ఆర్థిక భారం పడుతోందని అన్నారు. రైతులు పాములు, పురుగుల మధ్య రాత్రిపూట పొలాల్లో పడిగాపులు కాయాల్సి వస్తోందన్నారు. రైతు బీమా ప్రీమియం చెల్లించక, పంట రుణమాఫీ పూర్తిగా చేయక రైతులను మోసం చేశారని విమర్శించారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి పార్టీలు మారడంపై ఉన్న శ్రద్ధ రైతుల ప్రాణాలపై లేదని, అధికార పార్టీలో ఇద్దరు నేతల ఆధిపత్య పోరుతో గ్రామాలు చీకట్లో మగ్గుతున్నాయని ఆరోపించారు. విద్యుత్ సమస్యలకు తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బుచ్చిబాబు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ఎంఈఓ పరిశీలన





**కొల్లాపూర్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** కొల్లాపూర్ మండలం ఎల్లూరు ప్రభుత్వ పాఠశాలను ఎంఈఓ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాబోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, పాఠశాల నిర్వహణ, రికార్డులను పరిశీలించారు. నాలుగో తరగతి విద్యార్థుల గణిత సామర్థ్యాలను డిజిటల్ విధానంలో పరీక్షించి, వెనుకబడిన వారికి అదనపు సాధన చేయించాలని సూచించారు. ఉపాధ్యాయురాలు తులసి బోధనా విధానాన్ని పరిశీలించిన ఎంఈఓ, చింతగింజల వంటి బోధనా సామగ్రిని ఉపయోగించి గణితంపై ఆసక్తి పెంచాలని సూచించారు. రెమిడియల్ పీరియడ్ ద్వారా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. విద్యార్థులు భయపడకుండా ధైర్యంగా చదివి, ప్రతిరోజూ సాధన చేయాలని సూచించారు. గైర్హాజరయ్యే విద్యార్థులను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా బడికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రతపై శ్రద్ధ వహించి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం వారానికి మూడు గుడ్లు అందించాలని తెలిపారు.

# నేర దర్యాప్తులో నాణ్యత పెంచాలి: ఎస్పీ పరితోష్ పంకజ్

- బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో పెండింగ్ కేసులు, మిస్సింగ్ కేసులు, ఎన్‌బీడబ్ల్యూ అమలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల నియంత్రణపై సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, మిస్సింగ్ కేసుల ఛేదన, ఎన్‌బీడబ్ల్యూ అమలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. తీవ్రమైన నేరాల్లో శాస్త్రీయ ఆధారాలు సేకరించి నిందితులకు శిక్ష పడేలా సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టాలని, సాంకేతిక, న్యాయపరమైన సందేహాల నివృత్తికి దర్యాప్తు సహాయక కేంద్రం సేవలను వినియోగించుకోవాలని అన్నారు.






రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాద ప్రాంతాలను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాతీయ రహదారుల పరిసర గ్రామాల్లో ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మహిళల భద్రతకు షీ టీమ్స్ అప్రమత్తంగా పనిచేస్తూ వేధింపులను అరికట్టాలని, మహిళా చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. వినాయక నవరాత్రుల నేపథ్యంలో గ్రామ పోలీసు అధికారులు ప్రజలు, యువతతో సమన్వయంతో పనిచేసి నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రౌడీషీటర్లు, కేడీలు, అనుమానితుల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు.

ఆర్థిక, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలను అప్రమత్తం చేయాలని, నేరాల ఛేదనలో కీలకమైన సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలని సూచించారు. గ్రామాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలు, ప్రార్థనా స్థలాలు, పరిశ్రమలు, ధాబాలు, పెట్రోల్ బంకుల వద్ద సముదాయ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి పోలీసు వాహనాలను పరిశీలించి క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించి అత్యవసర సమయాల్లో సిద్ధంగా ఉంచాలని సూచించారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ నగదు రివార్డులు, ప్రశంసాపత్రాలతో అభినందించారు. సమావేశంలో డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మా బొరుసు ఆడుతున్న ఏడుగురు అరెస్ట్

- రూ.24,510 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్



**వెల్దుర్తి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** మాసాయిపేట మండలం హక్కింపేట గ్రామ పరిధిలోని హక్కింపేట డ్యామ్ సమీపంలో బొమ్మా బొరుసు ఆడుతున్న ఏడుగురిని టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు మంగళవారం మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడ కి చేరుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించి జూదం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు.

వారిలో దేవసోత్ దశరథ్, మల్లారెడ్డి నవీన్‌రెడ్డి, ఎండీ హుస్సేన్, దొడ్ల వినోద్, మల్లబోయిన గణేష్, పాశం మాణిక్‌రెడ్డి, గాండ్ల రాజుల వద్ద నుండి రూ. 24,510 నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్పి తెలిపారు.

**ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..** జిల్లాలో జూదం, బొమ్మా బొరుసు, బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. జూదం వల్ల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు పలు సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఇలాంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్టవిరుద్ధ జూదం, బెట్టింగ్‌కు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్పీ కోరారు.

## కల్వర్టు కింద యువకుడి మృతదేహం

**శివ్వంపేట, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** నవాబ్‌పేట గ్రామంలో యువకుడు కుక్కల నాగరాజు (36) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. తల్లిదండ్రులు మృతిచెందడంతో ఒంటరిగా జీవిస్తున్న నాగరాజు గ్రామంలో ఎవరు పని చెబితే అది చేస్తూ జీవించేవాడని గ్రామస్థులు తెలిపారు. సొంత ఇల్లు లేకపోవడంతో రాత్రిళ్లు అరుగులు, కొట్టాల్లో తలదాచుకునేవాడని చెప్పారు. వినాయక చవితి కోసం గ్రామానికి వచ్చిన నాగరాజు కల్వర్టుపై నిద్రిస్తుండగా ప్రమాదవశాత్తు కింద నీటిలో పడిపోయి మృతిచెందినట్లు గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేశారు.



సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## కొల్చారంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

**కొల్చారం, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** కొల్చారం గ్రామంలో దోమల నివారణకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేసి ప్రధాన వీధులు, కాలనీలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమల నివారణ మందును పిచికారి చేశారు. వర్షాకాలం నేపథ్యంలో నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి శుభ్రపరిచే చర్యలు చేపట్టారు.



ఈ సందర్భంగా సర్పంచ్ దేవన్న గారి శేఖర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా దోమల నివారణకు ప్రత్యేక మందును వినియోగిస్తున్నట్లు తెలిపారు. దోమల ద్వారా వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ ప్రజల ఆరోగ్య రక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుర్రంపల్లి రాణి గోపి, వార్డు సభ్యులు కృష్ణ, చింతల కృష్ణ, యాదగిరి, డాక్టర్ బాలరాజు, ప్రవీణ్, షేకులు, వనమాల శ్రీధర్, ప్రజాప్రతినిధులు మహేశ్వర్‌రెడ్డి, దేవన్న గారి ప్రశాంత్, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కరెంట్ కోతలతో రైతుల అరిగోస.. రైతులకు 24 గంటల విద్యుత్ ఇవ్వాలి..

- పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి, డిమాండ్..
- బీఆర్ఎస్ హయాంలో నిరంతర సరఫరా..
- కాంగ్రెస్ పాలనలో రైతుల బతుకులు ఆగమాగం..

**గండీడ్,సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** వ్యవసాయానికి విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి మండిపడ్డారు. రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని,కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.మంగళవారం బీఆర్ఎస్ నాయకులు,రైతులతో కలిసి గండీడ్ మండలం రెడ్డిపల్లి సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని,కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంట్ కోతలతో బోర్లు,బావుల కింద సాగు చేసిన పంటలు ఎండిపోయే దుస్థితి ఏర్పడిందన్నారు. రైతుల కష్టాలను ప్రభుత్వం వెంటనే గుర్తించి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో రైతుల ఆగ్రహాన్ని ప్రభుత్వం చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.అనంతరం 24గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ సబ్‌స్టేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మాసారం శ్రీనివాస్‌రెడ్డి,బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పెంట్యా నాయక్,దిడ్డికాడి గోపాల్,గాధిర్యాల్ మాజీ సర్పంచి,పి వెంకట్రాంరెడ్డి,గీతపాండు,మాజీ గ్రంథాలయ చైర్మన్,గోపాల్‌రెడ్డి,మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు ఉప్పరి గోపాల్ తదితరులు,రైతులు పాల్గొన్నారు.



## మంజీరా వాగులో మునిగి యువకుడి మృతి



**కొల్చారం, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** మంజీరా నది వాగులో చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన కోనాపూర్ శివారులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం కోనాపూర్‌కు చెందిన చాకలి బిక్షపతి (40) ఈ నెల 13న సాయంత్రం చేపలు పట్టేందుకు మంజీరా వాగు వద్దకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న మెదక్ అగ్నిమాపక సిబ్బంది సోమవారం ఉదయం నుంచి గాలింపు చేపట్టగా సాయంత్రం 4.50 గంటలకు మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొల్చారం ఎస్సై మహమ్మద్ మోహినుద్దీన్ తెలిపారు.

## ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిపై విమర్శలు సరికావు

- బాదేపల్లి పీఏసీఎస్ ఛైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్

**జడ్చర్ల, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి చేసిన విమర్శలు సరికావని బాదేపల్లి పీఏసీఎస్ ఛైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్ మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉదండాపూర్ నిర్వాసితులను పట్టించుకోకపోతే, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పోరాడి నష్టపరిహారం మంజూరు చేయించారని పేర్కొన్నారు. నియోజకవర్గానికి నవోదయ, యంగ్ ఇండియా స్కూల్, ట్రిపుల్ ఐటీ సాధించిన ఎమ్మెల్యేపై అవహేళన చేయడం తగదన్నారు.



నల్లకుంట వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ, ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను రక్షిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నాయకత్వంలో జడ్చర్లను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు.

## వైభవంగా ఉభయ మద్దిలేశ్వరి మాత జాతర ఉత్సవాలు

**నారాయణపేట, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బహార్ పేటలోని వెలిసిన ఉభయ మద్దిలేశ్వరి మాత జాతర ఉత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. అంతకుముందు స్థానిక అక్కల కిష్టప్ప ఇంటి నుండి అమ్మవారి ఉత్సవ మూర్తితో పల్లకి సేవ చేపడుతూ భక్తి భజనల మధ్య పల్లకి సేవ బహార్ పేట అమ్మవారి దేవాలయం వరకు చేపట్టారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు చేపట్టి, మహా అన్న ప్రసాదం కుంభం నైవేద్యం నివేదన చేశారు.



ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు డాక్టర్ క్యాతన్ రఘునాథ్, కార్యదర్శి తిలక్, ఉపాధ్యక్షులు అక్క లక్ష్మణ్, సంబరి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి కర్లీ దేవి వరప్రసాద్ భక్తులు, భజన మండలి సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## చిన్నోనిపల్లి
# లింక్ కెనాల్‌ను ఆర్‌డిఎస్ 12ఏకు కలపండి



**అయిజ, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** అయిజ మండలంలోని సింధనూర్, కుట్కనూర్, రైతులకు న్యాయం చేయాలని సర్పంచ్ ఇంద్రసేన గౌడ్, ఆధ్వర్యంలోరైతులు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషకు వినతి పత్రం ఇచ్చారు. గట్టు మండలం, చిన్నోనిపల్లి రిజర్వాయర్ నుంచి ఆర్ డి ఎస్ కు ఏర్పాటు చేసే లింక్ కెనాల్ ద్వారా 12ఏ, కెనాల్‌కు సాగునీరు అందేలా చర్యలు తీసు కోవాలని వినతిపత్రంలో కోరారు. 12ఏ, డిస్ట్రిబ్యూటర్ కింద దాదాపు వెయ్యి ఎకరాలు సాగు భూమి ఉందని వారు కలెక్టర్ కు వివరించారు. ప్రస్తుతం ప్రజల అవసరాలు తీర్చేందుకు తాగునీరు విడుదల చేయించడంతో పాటు, యాసంగి పంటకు సాగునీరు విడుదల చేయించాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ రైతుల ప్రయోజనాలు కాపాడాలని ఆర్ డి ఎస్ చీఫ్ ఇంజనీర్‌ను ఫోన్లో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనార్దన్ గౌడ్ రవి రెడ్డి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అనభేరి ప్రభాకర్‌రావు
# విగ్రహం ఏర్పాటు చేయాలి



**హుస్నాబాద్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 78వ వార్షికోత్సవాల్లో భాగంగా హుస్నాబాద్‌లో సీపీఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహానికి, మహ్మదాపూర్ అమరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో తొలగించిన అనభేరి విగ్రహాన్ని తిరిగి మల్లెచెట్టు చౌరస్తా వద్ద ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హుస్నాబాద్, మహ్మదాపూర్ ప్రాంతాలను ప్రభుత్వం అభివృద్ధి చేసి సుందరీకరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## పోడు భూముల పట్టాలపై కేసులు ఎత్తివేయాలి



**కొల్లాపూర్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** లంబాడీ వారసులకు పోడు భూముల పట్టాలపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఎస్టీ సెల్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులకు పోడు భూముల పట్టాలు అందించిందన్నారు. ప్రస్తుతం పట్టాల ఆధారంగా సాగు చేసుకుంటున్న వారిపై కేసులు నమోదు చేయడం సరికాదని పేర్కొన్నారు. లంబాడీ తండాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. కేసులు ఎత్తివేయకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నెల 17న కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించాలని పిలుపునిచ్చారు.

# చేయూత పెన్షన్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- **ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**





**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** చేయూత పెన్షన్ల కోసం వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను పారదర్శకంగా ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులతో పెన్షన్లు, ఎస్ఐఆర్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. భవిత కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే వికలాంగ చిన్నారులకు ప్రాధాన్యత ఇవ్వాలని, దరఖాస్తుల పరిశీలన అనంతరం మండలాల వారీగా వివరాలను నోటీసు బోర్డుల్లో ప్రదర్శించాలని సూచించారు. అభ్యంతరాలు వస్తే మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులకు నిబంధనల ప్రకారం సదరం సర్టిఫికెట్లు మంజూరు చేయాలని ఆదేశించారు.

ఎస్ఐఆర్‌లో మ్యాపింగ్ కాని, అనామిలిస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. హియరింగ్‌కు హాజరుకాని ఓటర్ల ఇళ్లకు బీఎల్ఓలు వెళ్లి అవసరమైన పత్రాలు సేకరించాలని, ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపు పత్రాల్లో తగిన ఆధారాలను యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఏఈఆర్ఓలు, అదనపు ఏఈఆర్ఓలు క్షేత్రస్థాయిలో బీఎల్ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనుల బిల్లులను పరిశీలించి వివరాలు పంపాలని, జలసిరి కార్యక్రమంలో నీటి కుంటలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు.

మరుగుదొడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించాలని, వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, సాదాబైనామా, భూభారతి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించి రీసర్వే పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలి



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రభుత్వం నిర్వహించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తిని మధుసూదన్, సేవా సంకల్పం అభియాన్ పట్టణ కన్వీనర్ గజరాజుల తిరుమలేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ టి.వినోద్, ఆర్డీవో సుబ్రహ్మణ్యంలకు వినతిపత్రం అందజేశారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన చారిత్రక సందర్భాన్ని గుర్తు చేస్తూ, విమోచన పోరాటంలో పాల్గొన్న అమరవీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ విమోచన చరిత్ర పరిరక్షణకు ప్రభుత్వం 'తెలంగాణ సప్త సంకల్పాలు' అమలు చేయాలని కోరారు. సెప్టెంబర్ 17ను రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో అధికారికంగా నిర్వహించడంతో పాటు హైదరాబాద్‌లో సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు 'స్టాట్యూ ఆఫ్ లిబరేషన్–తెలంగాణ' ఏర్పాటు చేయాలని, హైదరాబాద్–తెలంగాణ విమోచన మ్యూజియం, ప్రతి జిల్లా కేంద్రంలో విమోచన స్మృతి కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విమోచన చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చడంతో పాటు చారిత్రక ప్రాంతాల్లో స్మారక స్తూపాలు, విమోచన పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు అయ్యంగారి ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతూరి బుచ్చన్న, రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, వారణాసి కల్పన, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాశెట్టి శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోస్టర్ పాయింట్ల
# రద్దుకు 'మాల విద్యార్థి గర్జన'

- **అక్టోబర్ 10న భారీ కార్యక్రమం..**
- **మెదక్‌లో పోస్టర్ ఆవిష్కరణ**



**కొల్చారం, సెప్టెంబర్ 15(జనంసాక్షి):** రోస్టర్ పాయింట్ల వల్ల మాల విద్యార్థులు, ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని, వాటిని పూర్తిగా రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని రోస్టర్ పాయింట్ల వ్యతిరేక పోరాట సమితి నాయకులు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 10న నిర్వహించనున్న 'మాల విద్యార్థి గర్జన' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం మెదక్ పట్టణంలో జెన్‌జీ విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించారు.

రోస్టర్ పాయింట్ల విధానం వల్ల మాల విద్యార్థులు, ఉద్యోగులకు జరుగుతున్న నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అడ్వకేట్ ప్రశాంత్, మాజీ సర్పంచ్ ఎల్లేశం, శాంతికుమార్, ప్రవీణ్, అశోక్, చింటూ, భూమేష్, సందీప్, శ్రావణ్, నాగేష్, దివాకర్, రూబెన్, దానియేలు తదితర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల భవనంలో
# అక్రమనిర్మాణాలపై విద్యాశాఖ హెచ్చరిక..



**మహమ్మదాబాద్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** మండలంలోని ఆముదాలగడ్డ తండా గ్రామపంచాయతీ పరిధి బొట్లగడ్డ తండా ప్రాథమిక పాఠశాల భవనం ఆక్రమణ, కూల్చివేత వ్యవహారంపై విద్యాశాఖ అధికారులు స్పందించారు. మండల విద్యాధికారి, ఎంఈఓ రాజు నాయక్, నంచర్ల కాంప్లెక్స్ హెచ్ఎం సురేందర్‌రెడ్డి, పాఠశాల భవనాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు ఎంఈఓ తెలిపారు. పాఠశాల ఆవరణలో ఎలాంటి కొత్త నిర్మాణాలు చేపట్టరాదని, ఉన్న నిర్మాణాలను తొలగించరాదని సంబంధితులను హెచ్చరించారు. ఇప్పటికే సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు సంబంధితులకు నోటీసులు జారీ చేశారు. గతంలో పాఠశాల కోసం భూమి ఇచ్చామని, ప్రస్తుతం నివాస సౌకర్యం లేక భవనంలో ఉంటున్నామని వారు తెలిపారు. ఇకపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టబోమని హామీ ఇచ్చారు. విద్యార్థుల అభ్యసనానికి ఆటంకం కలగకుండా తరగతులను మిగతా గదుల్లో నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

# ఘనంగా వినాయక చవితి వేడుకలు..

- **ఆధ్యాత్మిక శోభతో మారుమోగుతున్న మండపాలు**



**చేర్యాల, సెప్టెంబర్ 15(జనంసాక్షి):** మండల వ్యాప్తంగా సోమవారం వినాయక చవితి వేడుకలు ఎంతో వైభవంగా, ఆధ్యాత్మిక శోభ నడుమ మొదలయ్యాయి. మండల కేంద్రంతో పాటు గ్రామాలలో మండపాలు, ఆలయాలు గణపతి నామ స్మరణలతో మారుమోగుతున్నాయి.

ఉదయం నుంచే భక్తులు, వివిధ రంగాల ప్రముఖులు ఆలయాలకు చేరుకొని బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. మండపం పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి.

## అంబేద్కర్ స్మారక గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యేలు



జడ్చర్ల, సెప్టెంబర్ 15 (జనంసాక్షి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చదువుకునే సమయంలో (1921–22) నివసించిన చారిత్రక గృహాన్ని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మంగళవారం సందర్శించారు. మహారాష్ట్ర ప్రభుత్వం 2015లో దీనిని స్మారక మ్యూజియంగా అభివృద్ధి చేయగా, అక్కడ భద్రపరిచిన అంబేద్కర్ అరుదైన ఛాయాచిత్రాలు, వ్యక్తి గత వస్తువులను ఎమ్మెల్యేలు పరిశీలించారు. విదేశాల్లో సంపాదించిన జ్ఞానాన్ని దేశంలోని అణగారిన వర్గాల హక్కులు, సామాజిక సమానత్వం కోసం వినియోగించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని, ఆయన చూపిన బాట నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు, సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు.

# పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో మట్టి గణపతికి పూజలు



నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 15 (జనంసాక్షి): నారాయణపేట జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహానికి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ దంపతులు, పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు. మహాగణపతిని ప్రార్థించి ప్రజల కష్టాలు తొలగి సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. నారాయణపేట జిల్లాలో ప్రజల్లో నెలకొన్న సోదరభావం, ఐక్యత అభినందనీయమన్నారు. పోలీసు శాఖ సూచనల మేరకు మండపాల నిర్వాహకులు, యువత భద్రతా చర్యలు పాటిస్తున్నారని తెలిపారు. నవరాత్రుల నుంచి నిమజ్జన శోభాయాత్ర వరకు ప్రజలు పోలీసులకు సహకరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు నల్లపు లింగయ్య, విజయ్ భాస్కర్, సీఐ శివశంకర్, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, అధికారులు భాగ్యలక్ష్మిరెడ్డి, శ్వేత, శిరీష, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సమితి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షునిగా డాక్టర్ వై.వెంకట మూర్తి



అమరచింత, సెప్టెంబర్ 15 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర సమితి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సమితి నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అనుబంధ సంఘాల అధ్యక్షులను జిల్లా అధ్యక్షులను ప్రకటించడం జరిగింది. ఈ కార్యవర్గంలో మహబూబ్ నగర్ పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులు సంఘ సేవకులు డాక్టర్ వై వెంకట మూర్తి తెలంగాణ రాష్ట్ర సమితి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకోవడం పట్ల తెలంగాణ ఉద్యమకారులు మహబూబ్ నగర్ జిల్లా వైద్యులు తెలంగాణ రాష్ట్ర డెంటల్ డాక్టర్ అసోసియేషన్ తోపాటు జిల్లా కవులు కళాకారులు తెలంగాణ రాష్ట్ర సమితి కార్యకర్తలు హర్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులు తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులు శ్రీధర్ మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్రమే ఏకైక లక్ష్యంగా 2001 నుండి తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొంటూ కవితక్క ఆదేశించిన కార్యక్రమాల్లో పాల్గొంటూ కవితకు అత్యంత సన్నిహితుడిగా పేరు పొందారు 2012 నుండి తెలంగాణ జాగృతి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడిగా జాగృతిని బలోపేతం చేస్తూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లారు జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి కల్పనలో భాగంగా పాలమూరు పట్టణంలో జాగృతి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ సంస్థలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి చూపించారు. గ్రహణం వల్ల అంగవైకల్యం కలిగిన చిన్నారులకు వెయ్యి మందికి పైగా చిన్నారులకు ఉచిత శస్త్ర చికిత్స చేయించారు. గ్రామీణ ప్రాంతాలలో దంత సమస్యల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు స్కూల్ విద్యార్థులకు ఉచిత వైద్యం శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు. తెలంగాణ డాక్టర్ అసోసియేషన్ జాక్ జేఏసీ ఏర్పాటుచేసి వైద్యులను తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములు చేశారు. వీరి సేవలను గుర్తించి కవితక్క తెలంగాణ రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షుడు గా బాధ్యతలు నిర్వర్తిస్తూ కవితక్క ఆదేశించిన అన్ని కార్యక్రమాల్లో ముందుంటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నందుకు తెలంగాణ రాష్ట్ర సమితి మహబూబ్ నగర్ జిల్లా టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక పట్ల పాలమూరు మేధావులు పుర ప్రముఖులు కవులు కళాకారులు తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులు అభినందనలు తెలియజేశారు.


# గణేశ్ నిమజ్జనానికి రంగం సిద్ధం



రాజోళి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి): వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి సుంకేసుల డ్యాం వద్ద చేపడుతున్న ఏర్పాట్లను రాజోళి ఎస్ఐ కిరణ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులతో కలిసి డ్యాంను సందర్శించిన ఆయన నిమజ్జన కార్యక్రమం సజావుగా, ప్రశాంతంగా జరిగేలా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. నిమజ్జనం కోసం వచ్చే భక్తులు, వినాయక విగ్రహాల తరలింపులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. డ్యాం పరిసరాల్లో భద్రతా చర్యలు, నిమజ్జన ప్రదేశం, రాకపోకలు తదితర అంశాలను పరిశీలించారు.

## నాలుగు దశాబ్దాలుగా బీజేపీకి అంకిత సేవలు

- మున్నూరు రవీందర్‌కు నామినేటెడ్ పదవి ఇవ్వాలి
- వనపర్తి ప్రజలు, కార్యకర్తల ఆకాంక్ష



వనపర్తి బ్యూరో, సెప్టెంబర్15 (జనంసాక్షి): నాలుగు దశాబ్దాలుగా భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, ప్రతికూల పరిస్థితుల్లోనూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన సీనియర్ బీసీ నాయకుడు, ప్రముఖ న్యాయవాది మున్నూరు రవీందర్‌కు సముచిత గుర్తింపు ఇవ్వాలని వనపర్తి నియోజకవర్గ ప్రజలు, బీజేపీ కార్యకర్తలు కోరుతున్నారు. సుదీర్ఘకాలంగా పార్టీ కోసం పనిచేస్తూ ప్రజా సమస్యలపై పోరాడిన ఆయనకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నారు.

**ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటం...**

1975 ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో పాల్గొన్న రవీందర్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసనగా దిష్టిబొమ్మ దహనం చేసి జైలుకు వెళ్లారని పార్టీ శ్రేణులు గుర్తుచేస్తున్నాయి. అప్పటి నుంచే పార్టీ సిద్ధాంతాల పట్ల ఆయన నిబద్ధత కొనసాగిందని పేర్కొంటున్నారు. 1991లో నక్సల్స్ కాల్పుల ఘటనలో ప్రాణాపాయం నుంచి బయటపడినప్పటికీ పార్టీని వీడకుండా రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు. 1993–94లో వనపర్తి నియోజకవర్గంలో విస్తృతంగా పాదయాత్రలు నిర్వహించి గ్రామాలు, పట్టణాల్లో బీజేపీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు.

**1994లో తొలిసారి పోటీ...**

పార్టీకి అనుకూల పరిస్థితులు లేని సమయంలో అభ్యర్థులు ముందుకు రాని సందర్భంలో పార్టీ ఆదేశాలను స్వీకరించి 1994లో వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. అనంతరం కూడా పలుమార్లు పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తూ పార్టీ ఉనికిని బలోపేతం చేసేందుకు కృషి చేశారు. అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్.కే. అద్వానీ, మురళీ మనోహర్ జోషి వంటి నేతల సిద్ధాంతాల నుంచి స్ఫూర్తి పొందిన రవీందర్ పార్టీ కష్టకాలంలోనూ కార్యకర్తలకు అండగా నిలిచారని ఆయన అనుచరులు చెబుతున్నారు.

**పేదలకు ఉచిత న్యాయ సహాయం...**

న్యాయవాదిగా కూడా రవీందర్ పేదలు, ఆర్థికంగా వెనుకబడిన వారికి అనేక సందర్భాల్లో ఉచితంగా న్యాయ సహాయం అందించారని సన్నిహితులు చెబుతున్నారు. వనపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో న్యాయవాదుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం కృషి చేశారని పేర్కొంటున్నారు.

**సేవలకు గుర్తింపు ఇవ్వాలి...**

సుమారు 40 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేసిన రవీందర్‌కు ఇప్పుడు తగిన గుర్తింపు ఇవ్వాల్సిన సమయం వచ్చిందని బీజేపీ కార్యకర్తలు అంటున్నారు. ముఖ్యంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆయనకు నామినేటెడ్ పదవి కల్పిస్తే ఆ వర్గాల్లో పార్టీపై మరింత విశ్వాసం పెరుగుతుందని పేర్కొంటున్నారు. పార్టీ కోసం పదవులను లెక్కచేయకుండా పనిచేసిన నాయకుడిగా రవీందర్‌కు గుర్తింపు ఉందని, ఆయన సుదీర్ఘ రాజకీయ అనుభవం, ప్రజా సేవ, న్యాయవాదిగా అందిస్తున్న సేవలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర, కేంద్ర బీజేపీ నాయకత్వం సముచిత నామినేటెడ్ పదవి ఇవ్వాలని వనపర్తి ప్రజలు, కార్యకర్తలు కోరుతున్నారు.

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రాజోళి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి): అక్రమ ఇసుక రవాణాపై రాజోలి పోలీసులు కొరడా ఝుళిపించారు. మంగళవారం ఉదయం బ్లూ కోర్టు విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు ఆంజనేయులు, పాలాక్షి రెడ్డి, పెద్ద తాండ్రపాడు గ్రామ శివారులో గస్తీ నిర్వహిస్తుండగా తుమ్మిళ్ల వైపు నుంచి ఓ ఇసుక ట్రాక్టర్ రావడంతో అనుమానంతో ఆపి తనిఖీ చేశారు. ట్రాక్టర్‌లో ఇసుకను ఎలాంటి ప్రభుత్వ అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని రాజోలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కానిస్టేబుల్ పాలాక్షి రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజోలి ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అమీన్‌పూర్‌లో భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలు

- మండపాల వద్ద విద్యుత్ భద్రతా నిబంధనలు పాటించాలి: చీఫ్ ఇంజినీర్ రమేష్, ఎస్ఈ సుధీర్

అమీన్‌పూర్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి): అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలో వినాయక నవరాత్రి ఉత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. వాడవాడలా వినాయక మండపాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీరంగూడ మార్కెట్‌లోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పలుచోట్ల ఆకర్షణీయమైన మండపాలు ఏర్పాటు చేయగా, కొన్ని చోట్ల మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు.

మంగళవారం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పలు వినాయక మండపాలను సందర్శించారు. మేడ్చల్ జోన్ చీఫ్ ఇంజినీర్ రమేష్, సంగారెడ్డి జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ సుధీర్, పటాన్‌చెరు డివిజనల్ ఇంజినీర్ భాస్కర్, అసిస్టెంట్ ఇంజినీర్ సంజీవ్ మండపాలను పరిశీలించారు. అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహాగౌడ్ ఏర్పాటు చేసిన మహా గణనాథుని మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈ రామకృష్ణ, వార్డు ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీరంగాపూర్ ఎంపీడీవోగా పూర్తి బాధ్యతలు స్వీకరించిన చెన్నయ్య



శ్రీరంగాపూర్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి): గట్టు మండలం నుండి ప్రమోషన్ పై శ్రీరంగాపూర్ మండలానికి బదిలీ అయిన ఎంపీడీవో చెన్నయ్య సోమవారం పూర్తిస్థాయి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఎంపీఓ రాజు నుండి చెన్నయ్య ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీఓ రాజు ఆయనకు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్, మండల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు కోతలకు ఎండిన వరి.. గొర్రెలకు మేత!

**గొర్రెలకు మేతగా వదిలేసిన పంట..**

పంట చేతికొచ్చే పరిస్థితి లేకపోవడంతో ఎండిపోయిన వరిని చివరకు గొర్రెలు, పశువులకు మేతగా వదిలేయాల్సిన దుస్థితి రైతుకు ఎదురైంది. పంట కోసం పెట్టిన పెట్టుబడి, శ్రమ కళ్లముందే వృథా కావడంతో రైతు బాల్‌రాజ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు.

**నా పొలానికే కాదు.. అందరికీ పరిహారం ఇవ్వాలి...**

రైతు బాల్‌రాజ్ మాట్లాడుతూ.. కరెంటు కోతలు, తీవ్ర ఎండల కారణంగా తన పొలమే కాకుండా గ్రామంలోని పలువురు రైతుల వరి పంటలు కూడా దెబ్బతిన్నాయని తెలిపారు. పంట నష్టాన్ని ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలించి, తనకు మాత్రమే కాకుండా నష్టపోయిన ప్రతి రైతుకు తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకునేందుకు అధికారులు వెంటనే పంట నష్టం అంచనా వేయాలని కోరారు.

## రేపల్లె గ్రామాన్ని సందర్శించిన జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి బృందం

- **ఈ నెల 18న కలెక్టరేట్ ముట్టడి**



**గద్వాల నడిగడ్డ ,సెప్టెంబర్ 15 (జనంసాక్షి);** గద్వాల మండలం రేపల్లె గ్రామంలో జరిగిన సంఘటనపై ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా బృందం గ్రామాన్ని సందర్శించింది. అలాగే బృందం సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన అమ్మాయి, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అబ్బాయి ప్రేమించుకుని పెళ్లి చేసుకోవడంతో అమ్మాయి కుటుంబసభ్యులు గ్రామ సర్పంచ్ అండతో అబ్బాయి ఇళ్లను ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ సందర్భంగా వారు డిమాండ్ చేస్తూ... బాధిత కుటుంబాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీ పరామర్శించి భరోసా కల్పించా లని, కుట్రదారులైన రేపల్లె గ్రామ సర్పంచ్ తో పాటు మరికొంత మందిని ఎఫ్ ఆర్ ఐ లో చేర్చి రిమాండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 18న జిల్లా కలెక్టర్ కార్యాలయమును ముట్టడిస్తామనిహెచ్చరించారు. ఈ ఘటనపై గద్వాల ఉండే పాలకులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కొంకల భీమన్న మాదిగ, మస్తాన్, ఐజ రాజు, పోగుల రాజేష్, గద్వాల అశోక్, ఎల్కూర్ భాస్కర్, మోషే, విజయ్ కుమార్, హనుమంత్, కన్నా, పరశురామ్, చిన్నపాడు ఆంజనేయులు, గువ్వలదిన్నె జంబయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## అప్పాజీపల్లిలో ఎంపీడీవో ఆకస్మిక తనిఖీలు!



**బాలానగర్, సెప్టెంబర్ 15(జనంసాక్షి):** బాలానగర్ మండలంలోని అప్పాజీపల్లి గ్రామంలో మంగళవారం ఎంపీడీవో అనిల్ కుమార్ రెడ్డి అంగన్ వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.
ముందుగా అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన, చిన్నారుల హాజరు రిజిస్టర్, పౌష్టికాహారం నాణ్యత, గర్భిణీలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కేంద్రం నిర్వహణ మెరుగ్గా ఉండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ చదువుపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేతావత్ వెంకటేష్ నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## పసందైన భోజనం.. కడుపు నిండా తింటున్నారు!

కార్యక్రమాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ ప్రాంత విద్యార్థులు రుణపడి ఉంటారు" అని కోహీర్ ఎంఈఓ జాకీర్ హుస్సేన్ తెలిపారు.

**ఆకలి లేని బడి.. ఆనందంగా చదువు...**

కోహీర్ మండల నియోజకవర్గంలో ని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు భోజనం చేస్తూ కనిపించారు. ఒకవైపు చదువు.. మరోవైపు పౌష్టికాహారం అందుతుండటంతో విద్యార్థుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. పేద విద్యార్థుల కడుపు నింపి.. వారి చదువుకు బాటలు వేస్తున్న ఈ పథకాన్ని మరింత పటిష్ఠంగా అమలు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. పుస్తకాల బ్యాగుతో బడికి వచ్చే చిన్నారులకు.. కడుపు నిండా భోజనం అందితే వారి ముఖాల్లో కనిపించే చిరునవ్వే ఈ పథకానికి అసలైన విజయానికి నిదర్శనమని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

## చెరువులో చేపలు పట్టే అధికారం మత్స్యకారులకే ఉంది

- **మత్స్యశాఖ జిల్లా అధికారి నరసింహారావు**



**బిజినేపల్లి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి):** చెరువులలో చేపలు పట్టే అధికారం మత్స్యకారులకే ఉందని, చెరువు సికంలో ఇతరులు ఎవరికి పట్టా ఉన్ననీటిమట్టం తగ్గిన తర్వాత పంట పొలం వేసుకోవాలే తప్ప చేపలు పట్టే అధికారం సికం పట్టాదారులకు లేదని జిల్లా మత్స్య శాఖ అధికారి నరసింహారావు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మంగనూరు గ్రామంలో గల కొత్త కుంట చెరువును ఇరిగేషన్ అధికారులు, పోలీస్ అధికారులు సందర్శించారు.
**అనంతరం జిల్లా మత్స్యశాఖ అధికారి మాట్లాడుతూ....** ప్రభుత్వ నిబంధనల ప్రకారం మత్స్య కారులైనప్పటికీనిచెరువులు,కుంట యొక్క రకముప్రభుత్వానికి చెల్లించిన తర్వాతఫిషింగ్ రైట్స్ పొందిచేపలు పట్టుకోవాలని సూచించారు.ఇరిగేషన్ అధికారులుచెరువు యొక్క పూర్తి విస్తీర్ణం ఎఫ్.టి.ఎల్,బఫర్ జోన్లలోఎలాంటి నిర్మాణాలుగుంతలు నిర్మించడం,కట్టలు పోయడంలాంటి నిర్మాణాలు చేపట్టడం రాదన్నారు.తెలంగాణ నీటిపారుదల చట్టం1357.ఎఫ్ ఏ ఎస్ ఎల్ సెక్షన్39ఉ40ప్రకారంప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమనిఆయన అన్నారు.
కుల హక్కులను కాపాడుకోవడానికిప్రభుత్వ అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ షంషద్దీన్,రెవిన్యూ సిబ్బంది, మత్స్యకారులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17న కలెక్టరేట్లో ప్రజా పాలన దినోత్సవం


- **ప్రజాపాలన దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**
- **నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య, దేవ సహాయం**




**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 15(జనంసాక్షి):** మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో సెప్టెంబర్ 17న జరుపబోయే ప్రజాపాలన దినోత్సవం ఏర్పాట్ల గురించి జిల్లా అధికారులకు తమ శాఖలకు సంబంధించిన పనులను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. చెన్నయ్య, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) దేవ సహాయం, అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమానికి అధికారులందరూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఈ కార్యక్రమంలో జాతీయ జెండా ఆవిష్కరణకు సంబంధించిన ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని, జాతీయ పతాకం ఏర్పాటు, సభా వేదిక అలంకరణ, ప్రోటోకాల్ ప్రకారం వీఐపీలు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు.అలాగే షామియానాలు, కుర్చీలు, బ్యారికేడ్లు, తాగునీటి వసతి తదితర ఏర్పాట్లను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఆహ్వాన పత్రికల పంపిణీ వంటి అంశాల్లోనూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్య అతిథి సందేశం తదితర కార్యక్రమాలకు సంబంధించి అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలన దినోత్సవం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ప్రతి శాఖకు అప్పగించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ, పాండు, కలెక్టరేట్ ఏ.వో చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భవితకు రక్షణ..మట్టి ప్రతిమ..!

- **ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)తో ఎన్నో అనర్థాలు**
- **పర్యావరణపై సర్పంచుల అభిప్రాయాలు..**








**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 15(జనంసాక్షి):** రసాయనాలతో తయారు చేసే వినాయక విగ్రహాలను పూజించరాదని, వాటిస్థానంలో మట్టితో తయారు చేసే విగ్రహాలను ప్రతి ష్ఠించాలని ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు.రసాయన విగ్రహాలు వద్దు... మట్టి వినాయకులే ముద్దు' అనే నినాదంతో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని వారు కోరుతున్నారు. విగ్రహాల తయారీలో ఉపయోగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)తో ఎన్నో అనర్థాలు వస్తాయన్నారు. గణపతి విగ్రహాలకు పూసే రసాయనాలు నీటిలో జీవించే జీవరాశులకు ముప్పు చేకూరుతుందన్నారు. మానవాళికి ప్రమాదకరమైన
వ్యాధులు రావడానికి కారణమవుతాయన్నారు. మట్టి విగ్ర హాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వారు తెలిపారు. పిఓపి వినాయకుల అనర్థాల గురించి వినాయక చవితి సందర్భంగా కొంతమంది మహిళ సర్పంచుల అభిప్రాయాలు.......

**ప్లాస్టర్ ఆఫ్ పారిస్ హానికరం...**
**మునిపల్లి సర్పంచ్... సౌందర్య**



వినాయకుడి విగ్రహ లను చేసేందుకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వాడటం, రంగులను వినియోగించడం ద్వారా వాటిని నిమజ్జనం చేసినప్పుడు వాతావ రణం కాలుష్యం ఏర్పడుతుంది. మట్టి విగ్ర హాలు నీటిలో పూర్తిగా నిమజ్జనమై... నీరు కలుషితం కాకుండా ఉంటుంది.

**బాధ్యత మనదే... చిన్న చల్మెడ**
**సర్పంచ్ రుద్ర గాయత్రి**



వాతావరణంలో కాలుష్య నియంత్రణను యువత బాధ్యతగా తీసుకోవాలి. సంప్రదాయాలను కొనసాగిస్తూనే పర్యావరణాన్ని కాపాడుకోవాలి. వినాయక చవితి సంద ర్భంగా ప్రతి ఒక్కరూ మట్టితో చేసిన విగ్రహాలనే ఏర్పాటు చేసుకోవాలి. రసాయనాలతో కూడిన విగ్రహాలు హానికరం. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. మట్టి ప్రతిమలనే పూజించేలా ప్రతి ఒక్క రినీ ప్రోత్సహించాలి.

**కాలుష్యాన్ని నివారించాలి...**
**కంకోల్ సర్పంచ్ మమత**



వినాయక చవితి సందర్భంగా సంప్రదాయానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలి. రంగు విగ్రహా లతో కాలుష్యం పెరగడంతో పాటు అనేక రోగాలు వ్యాపిస్తాయి. ఈ విగ్రహాల్లో వాడే రసాయనాలు వల్ల కలిగే ఇబ్బందులు తెలుసుకోవాలి. ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకుని తప్పనిసరిగా మట్టి విగ్రహాలను ఉపయోగించి పూజ చేయాలి.

**అందరిలో మార్పు అవసరం...**
**తొగర్ పల్లి సర్పంచ్ దివ్యవాణి**



అందరిలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. వినాయకుడిని మనం విఘ్నాలు తొలగాలని పూజిస్తాం. అయితే రసాయనాలతో కూడిన వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకుని ఇబ్బందులు కలగజేసుకుంటున్నాం. విఘ్నాలు తొలగాలంటే మట్టి విగ్రహాలనే ఏర్పాటు చేసుకోవాలి.

# ఉద్యోగ మేళాతో యువతకు ఉపాధి అవకాశాలు

- 120 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు..
- జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎం.రాధిక



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 15 (జనంసాక్షి): నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 18న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.రాధిక తెలిపారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో రంగారెడ్డి రీజియన్ శాంతినగర్‌లోని రీజినల్ ఆఫీస్‌లో ఈ మేళా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉద్యోగ మేళాలో రావిస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పాల్గొని అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు రాధిక తెలిపారు. మొత్తం 120 ఉద్యోగ ఖాళీలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్ 80 పోస్టులు, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ 40 పోస్టులు ఉన్నాయని వివరించారు. కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు నెలకు రూ. 21 వేలు, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు నెలకు రూ.26 వేల వేతనం ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు బేగంపేట, హైదరాబాద్‌లో విధులు నిర్వహించాల్సి ఉంటుందని రాధిక పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన నిరుద్యోగ యువత తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, రెజ్యూమ్, ఇతర అవసరమైన పత్రాలతో ఉద్యోగ మేళాకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 98664 65024, 7842617596 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలి

- మల్లారపు లక్ష్మీనారాయణ
- భక్తి, సేవాభావాలతో వినాయక చవితిని జరుపుకోవాలి
- వినాయక చవితి ఆధ్యాత్మికతకు, సామాజిక ఐక్యతకు ప్రతీక







కీసర, సెప్టెంబర్ 15 (జనంసాక్షి): వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని, భక్తి, సేవాభావాలతో వినాయక చవితిని జరుపుకోవాలని శ్రీ చీర్యాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ అన్నారు. వినాయక చవితి ఆధ్యాత్మికతకు, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

వినాయక చవితి సందర్భంగా చీర్యాలలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేవాలయ ప్రాంగణంలోని విఘ్నేశ్వరుడికి ఉదయాన్నే పంచామృత, నవకలశాభిషేకాలు నిర్వహించారు. అనంతరం గణపతి హోమం, వివిధ పత్రి, పుష్పాలతో విశేష పూజలు చేశారు. వినాయకుడికి ప్రీతికరమైన తుమ్మికూర, ఉండ్రాళ్ల పాయసం, పులిహోర, దద్దోజనం, బెల్లం పొంగలి, సున్నుండలను నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా మల్లారపు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రతి శుభకార్యానికి ముందు పూజలు అందుకునే గణనాథుడు విఘ్నాలను తొలగించి విజయాలను ప్రసాదిస్తాడన్నారు. వినాయక చవితి పండుగ కేవలం ఆధ్యాత్మిక వేడుక మాత్రమే కాకుండా ప్రజల్లో ఐక్యత, సోదరభావం, సేవా దృక్పథాన్ని పెంపొందించే మహత్తర ఉత్సవమని చెప్పారు. యువత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అనంతరం శ్రీ చీర్యాల లక్ష్మీనరసింహస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. శ్రీ చీర్యాల లంబోదర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాల తొలి రోజు పూజల్లో కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కీసర మండల మాజీ ఎంపీపీ మల్లారపు ఇందిరా, ధర్మకర్త శ్రీహరి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 22ఏ నిషేధిత భూములపై ధర్నాకు టీడీపీ పిలుపు

- 16న మేడ్చల్-మల్కాజ్‌గిరి కలెక్టరేట్ వద్ద ఆందోళన



కీసర, సెప్టెంబర్ 15 (జనంసాక్షి): 22ఏ నిషేధిత భూముల సమస్యపై ఈ నెల 16న మేడ్చల్-మల్కాజ్‌గిరి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నట్లు నాగారం డివిజన్ టీడీపీ సీనియర్ నాయకుడు జంగారెడ్డి తెలిపారు.

మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు సెప్టెంబర్ 16న షామీర్‌పేట్ మండలం అంతాయిపల్లి గ్రామంలోని కలెక్టరేట్ కార్యాలయం వద్దకు చేరుకోవాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. 22ఏ నిషేధిత భూముల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కిని నరసింహులు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ కన్వీనర్ కందికంటి అశోక్‌కుమార్ గౌడ్ హాజరుకానున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

2బీహెచ్‌కేలో గణేశ్ మండపం వద్ద

# బైరి నవీన్ గౌడ్ ప్రత్యేక పూజలు





కీసర, సెప్టెంబర్ 15 (జనంసాక్షి): ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు బి ఆర్ ఎస్ నాయకుడు బైరి నవీన్ గౌడ్ తెలిపారు.

కాప్రా సర్కిల్ వంపుగూడ డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ 2బీహెచ్‌కేలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాన్ని బీఆర్ఎస్ నాయకుడు బైరి నవీన్ గౌడ్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేశ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో రాములు నాయక్ తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బస్తీ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి

- డీఎంహెచ్‌ఓ డా.పుట్ల శ్రీనివాస్
- వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలి





హైదరాబాద్, సెప్టెంబర్ 15 (జనంసాక్షి): బస్తీ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డా.పుట్ల శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సత్వరమే పూర్తి చేయాలని, నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) సర్వే, స్క్రీనింగ్, ఫాలోఅప్ కార్యక్రమాలను ప్రతిరోజూ నిర్వహించాలని స్పష్టం చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

మంగళవారం గోల్కొండ క్లస్టర్ పరిధిలోని కార్వాన్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, గుడిమల్కాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని హిల్‌కాలనీ బస్తీ దవాఖానాను డా. పుట్ల శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, ల్యాబొరేటరీ కేంద్రం, వివిధ రికార్డులు, పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు.

గర్భిణుల సంరక్షణ, చిన్నారుల టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మలేరియా, డెంగీ, చికున్‌గునియా వంటి వ్యాధుల నివారణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలను సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి అందేలా సిబ్బంది కృషి చేయాలని తెలిపారు.

కార్యక్రమంలో గోల్కొండ క్లస్టర్ సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డా.మురళీధర్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.